
తెలుగు దినపత్రిక
ప్రభాత
jayabheridaily.com
# జయభేరి
సంపుటి : 01
సంచిక : 15
పేజీలు : 8
వెల : 4
మల్కాజిగిరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
శుక్రవారం, 28-07-2023

జయభేరి దినపత్రిక, జయభేరి ఛానల్‌లో
నిఖార్సైన జర్నలిస్టులుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు.. కథనాలు...
ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలనుకుంటున్నారా?
మీ కలాలకు పదును పెట్టండి....
విలేకర్లు కావలెను
ఆసక్తి కలిగిన యువతి యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత
email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com
9391 544 889 call me

## నా ప్రసంగం తొలగించారు..

### పీఎం మోదీ ప్రొగ్రామ్ కు నేను రాను



ప్రధాని మోదీ రాజస్తాన్ పర్యటన సందర్భంగా ప్రధాని కార్యాలయం, రాజస్తాన్ సీఎం అశోక్ గహ్లోత్ ల మధ్య మాటల యుద్ధం కొనసాగింది. ప్రధాని కార్యక్రమంలో తన ప్రసంగాన్ని తొలగించారని, అందువల్ల తాను ఆ కార్యక్రమానికి హాజరు కావడం లేదని బుధవారం ఉదయం గహ్లోత్ ట్వీట్ చేశారు. ప్రధాని మోదీ రాజస్తాన్ పర్యటన సందర్భంగా ప్రధాని కార్యాలయం, రాజస్తాన్ సీఎం అశోక్ గహ్లోత్ ల మధ్య మాటల యుద్ధం కొనసాగింది. ప్రధాని కార్యక్రమంలో తన ప్రసంగాన్ని తొలగించారని, అందువల్ల తాను ఆ కార్యక్రమానికి హాజరు కావడం లేదని బుధవారం ఉదయం గహ్లోత్ ట్వీట్ చేశారు. ఆ ప్రసంగంలో తాను అగ్నివీర్ స్కీమ్ రద్దు, రుణమాఫి డిమాండ్.. తదితర అంశాలను లేవనెత్తాలనుకున్నానని వెల్లడించారు.

**నా ప్రసంగం తొలగిస్తారా?**

ప్రధాని మోదీ బుధవారం రాజస్తాన్ లో పర్యటిస్తున్నారు. అక్కడ సికర్ లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తున్నారు. మరికొన్ని అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రొటోకాల్ ప్రకారం రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా పాల్గొనాలి. అయితే, ఆ కార్యక్రమంలో తన మూడు నిమిషాల ప్రసంగాన్ని తొలగించారని, అందువల్ల ఆ కార్యక్రమానికి హాజరు కావడం లేదని అశోక్ గహ్లోత్ బుధవారం ఉదయం ట్వీట్ చేశారు. ఆ ప్రసంగంలో తాను అగ్నివీర్ స్కీమ్ రద్దు, రుణమాఫి డిమాండ్.. తదితర అంశాలను లేవనెత్తాలనుకున్నానని వెల్లడించారు. ‘ నా ప్రసంగాన్ని తొలగించినందువల్ల, నేను స్వయంగా మీకు స్వాగతం పలకలేకపోతున్నా. అందుకే ఈ ట్వీట్ ద్వారా స్వాగతం పలుకుతున్నా’ అని ఆ ట్వీట్ లో పీఎం మోదీ ని ఉద్దేశించి గహ్లోత్ వ్యాఖ్యానించారు. గత ఆరు నెలల్లో ప్రధాని మోదీ ఏడు సార్లు రాజస్తాన్ కు వచ్చిన విషయాన్ని కూడా గహ్లోత్ ప్రస్తావించారు. త్వరలో రాజస్తాన్ లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

**మీ ప్రసంగం తొలగించలేదు..**

రాజస్తాన్ సీఎం అశోక్ గహ్లోత్ ట్వీట్ కు ప్రధాని కార్యాలయం స్పందించింది. ప్రధాని మోదీ కార్యక్రమంలో రాజస్తాన్ సీఎం గహ్లోత్ ప్రసంగాన్ని తొలగించలేదని, కాలికి గాయమైనందువల్ల గహ్లోత్ ఆ కార్యక్రమానికి రావడం లేదని తమకు సీఎంఓ నుంచి సమాచారం వచ్చిందని పీఎంఓ వెల్లడించింది.ప్రధాని మోదీ పాల్గొంటున్న కార్యక్రమ షెడ్యూల్ లో సీఎం గహ్లోత్ ప్రసంగం కూడా ఉందని స్పష్టం చేసింది. అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన శిలాఫలకాలపై కూడా ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ పేరు ఉందని తెలిపింది. గతంలో రాజస్తాన్ లో ప్రధాని మోదీ పాల్గొన్న అన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో సీఎంగా అశోక్ గహ్లోత్ పాల్గొని, ప్రసంగించిన విషయాన్ని పీఎంఓ గుర్తు చేసింది.

తెలుగు రాష్ట్రాలకు డేంజర్ వార్నింగ్ ఇస్తోంది వాతావరణశాఖ.. మరో రెండు మూడు గంటల్లో కుండపోత వర్షం కురుస్తుందని హెచ్చరిక.. ఏపీలో 10జిల్లాలకు, తెలంగాణలో 5 జిల్లాలకు రెడ్ అలెర్ట్.. కొత్తగూడెం జిల్లా సత్యనారాయణపురం, ఆర్. కొత్తగూడెం దగ్గర రోడ్లపైకి భారీగా వరదనీరు.. భద్రాచలం-చర్ల మధ్య వర్షపునీరు నిలిచిపోయింది.. తెలంగాణలో మొత్తం 15జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్.. వరంగల్‌జిల్లా కాజీపేటలో పిడుగుపడి ఇంట్లో వస్తువలన్నీ ధ్వంసం.. హిమాయత్‌సాగర్ గేట్లు ఎత్తడంతో రాజేంద్రనగర్, అత్తాపూర్ దగ్గర మూసీ నది ఉధృతం.. ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డుపై రాకపోకలు నిలిచిపోయాయి.. బాపుఘాట్ దగ్గర మూసీ ప్రవాహం పెరిగింది.. ఉత్తరాంధ్ర-దక్షిణ ఒడిశా తీరంలో అల్పపీడనం.. రానున్న మూడు రోజులపాటు ఏపీలో వానలు

# తెలుగు రాష్ట్రాలకు డేంజర్ వార్నింగ్

2 లో



# కాంగ్రెస్ జోష్ కు బ్రేక్


**జయభేరి, హైదరాబాద్ :**

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం తెలంగాణ కాంగ్రెస్ లో ఉత్సాహం నింపింది. జోష్' పెంచింది. అదే సమయంలో గత ఐదారు నెలలుగా, తెలంగాణ రాజకీయాల్లో కీలకం గా మారిన, బీఆర్ఎస్ బహిష్కృత మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి అటూ ఇటూ ఊగి చివరకు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడంతో ఆ జోష్ మరికొంత పెరిగింది. అలాగే పొంగులేటితో పాటుగా బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ అయిన మాజీ మంత్రి జూపల్లి కృష్ణా రావు, ఇంకా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోకపోయినా ఆయన పార్టీలో చేరడం కేవలం లాంఛనమే అని తేలిపోయింది.ఆయన పార్టీలో చేరినట్లే వ్యవహరిస్తున్నారు. పార్టీ సమావేశాల్లోనూ పాల్గొంటున్నారు. జూలై 30 కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ సమక్షంలో కాంగ్రెస్ లో చేరేందుకు ముహూర్తం సైతం ఖరారైంది. కొల్లాపూర్లో జరిగే సభలో జూపల్లి కృష్ణారావు, ఆయన అనుచరులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఇప్పటికే ప్రకటించారు. మరో వంక ఖమ్మంలో పొంగులేటి చేరిక సభను మరిపించేలా కొల్లాపూర్ సభను జయప్రదం చేయాలని తద్వారా పార్టీలో తన పట్టును పెంచుకునేందుకు జూపల్లి గట్టి పర్యటనలు చేస్తున్నారు. అయితే జూపల్లి చేరికను వ్యతిరేకిస్తున్న పాత కాంగ్రెస్ నాయకులు కొంత గుర్రుగా ఉన్నా, ఆయన తన దారిన తాను ముందుకు సాగుతున్నారు. అయితే ప్రస్తుతం రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడంతో వాతావరణం చల్లబడిన విధంగాన , రాజకీయ వాతావరణం కూడా కొంత చల్లబడినట్లు కనిపిస్తోంది. పొంగులేటి చేరిక నేపథ్యంగా తెరపైకొచ్చిన ఉచిత విద్యుత్ వివాదం విషయంలో అధికార బీఆర్ఎస్ కాంగ్రెస్ ను డిఫెన్సులోకి నెట్టే ప్రయత్నం చేసినా రోడ్లెక్కి ఆందోళనలకు దిగినా అల్టిమేట్ గా హస్తం పార్టీదే పైచేయి అయింది. అదెలా ఉన్నా ప్రతిరోజూ ఎవరో ఒకరు

మిగతా 2 లో



## కాంగ్రెస్ గూటికి జిట్టా



**జయభేరి, నల్గొండ :**

ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన బీజేపీ నేత పార్టీ మారేందుకు సిద్ధమయ్యారని తెలుస్తోంది. రేపోమాపో ఆయన హస్తం గూటికి చేరేలా కనిపిస్తోంది. తాజాగా ఆయన చేసిన కామెంట్సే ఇందుకు బలం చేకూరుస్తున్నాయి.అసెంబ్లీ ఎన్నికల సమయం దగ్గరపడ్డ కొద్ది ఉమ్మడి నల్గొండ జిల్లా రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. విభేదాల కారణంగా... ఈ మధ్యనే యాదాద్రి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనిల్ కుమార్ రెడ్డి పార్టీని వీడారు. ఎంపీ కోమటిరెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించిన ఆయన... కొద్ది నిమిషాల వ్యవధిలోనే కారెక్కారు. ఇదే టైంలో భువనగిరిలో పార్టీపరంగా తీసుకునే చర్యలపై ఫోకస్ పెట్టింది కాంగ్రెస్. అక్కడ బలమైన నేతగా పేరున్న జిట్టాపై కన్నేసింది. ప్రస్తుతం బీజేపీలో ఉన్న జిట్టా... చాలా రోజులుగా యాక్టివ్ గా కనిపించటంలేదు. దీనికితోడు బీజేపీని ఉద్దేశిస్తూ... తాజాగా ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. దీంతో ఆయన పార్టీ మారటం పక్కాగానే అనిపిస్తోంది. బీజేపీకి తాను మానసికంగా ఎప్పుడో దూరమయ్యాయని క్లారిటీ ఇచ్చేశారు. కాంగ్రెస్ లోకి రావాలంటూ తనకు

## సీబీఐ చేతికి.. మణిపూర్ వైరల్ వీడియో కేసు

మణిపూర్లో ఇద్దరు మహిళలను నగ్నంగా చేసి ఊరేగించిన సంఘటనకు సంబంధించిన కేసును సీబీఐకి అప్పగించింది కేంద్ర ప్రభుత్వం... ఈ మేరకు.. సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్లో పేర్కొంది.



2 లో

## జలపాతాల వద్ద చుక్కా ముక్కా బంద్



5 లో

ప్రభాత జయభేరి
jayabheridaily.com

▸▸ మొదటిపేజీ తరువాయి

## తెలుగు రాష్ట్రాలకు డేంజర్ వార్నింగ్



తెలుగు రాష్ట్రాలకు డేంజర్ వార్నింగ్ ఇస్తోంది వాతావరణశాఖ. మరో రెండు మూడు గంటల్లో కుండపోత వర్షం కురుస్తుందని హెచ్చరిక జారీ చేసింది. ఏపీలో 10జిల్లాలకు , తెలంగాణలో 5 జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసింది. ఇక కొత్తగూడెం జిల్లా సత్యనారాయణపురం, ఆర్. కొత్తగూడెం దగ్గర రోడ్లపైకి భారీగా వరదనీరు చేరింది. భద్రాచలంచర్ల మధ్య వర్షపునీరు నిలిచిపోయింది. గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తెలంగాణలో మొత్తం 15జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది వాతావరణశాఖ. అటు వరంగల్ జిల్లా కాజీపేటలో పిడుగుపడి ఇంట్లో వస్తువలన్నీ ధ్వంసం అయ్యాయి. పిడుగు బీభత్సంతో గోడలు విరిగిపడ్డాయి. దాంతో ఒక్కసారిగా స్థానికులు ఉలిక్కిపడ్డారు. ఎలక్ట్రానిక్ వస్తువులన్నీ కాలిపోయాయి. రాష్ట్రానికి 5 జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ వాతావరణశాఖ అధికారులు. హిమాయత్‌సాగర్ గేట్లు ఎత్తడంతో రాజేంద్రనగర్, అత్తాపూర్ దగ్గర మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డుపై రాకపోకలు నిలిచిపోయాయి. బాపుఘాట్ దగ్గర మూసీ ప్రవాహం పెరిగింది. పరీవాహక ప్రాంతంలో ప్రజలను అప్రమత్తం చేశారు అధికారులు.ఉత్తరాంధ్రదక్షిణ ఒడిశా తీరంలో అల్పపీడనం బలపడటంతో రానున్న మూడు రోజులపాటు ఏపీలో వానలు కురుస్తాయని వాతావరణశాఖ ప్రకటించింది. దాంతో ఏపీలో 10 జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసింది. మిగిలిన జిల్లాలకు తేలికపాటి, మోస్తరు వర్షాలు పడతాయని తెలిపింది. అటు విశాఖలో భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాల్లో వర్షం పడింది. భారీ వర్షాలకు నంద్యాల జిల్లా పాములపాడు మండలం మిట్టకందాలలో రెండు మిద్దెలు కూలాయి. ఐతే ఆ సమయంలో ఎవరు ఇంట్లో లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకుఎ వృక్షాలు నేలకూలాయి. పలుచోట్ల వాగులు, వంకలు పొంది పొర్లుతున్నాయి.ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా భద్రాచలం దగ్గర గోదావరి నది మహోగ్రరూపం దాల్చింది. గోదావరి నీటిమట్టం 45 అడుగులు దాటింది. రామాలయం చుట్టూ వరదనీరు చేరింది. విస్తా కాంప్లెక్స్, అన్నదాన సత్రం నీట మునిగాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో కట్టవాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. సుందరయ్యనగర్‌లో వందలాది ఇళ్లు జలమయం అయ్యాయి. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.కొత్తగూడెం జిల్లా పాల్వంచ కిన్నెరసాని జలశయానికి జలకళ ఉట్టిపడుతోంది. ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలకు ఎగువ నుంచి భారీగా వరదనీరు చేరుతోంది. దాంతో 5 గేట్లు ఎత్తి దిగువకు 29వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. నది పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైరన్ ద్వారా అధికారులు హెచ్చరిక జారీ చేశారు. ఉభయ గోదావరి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. కాకినాడ పరిసర ప్రాంతాల్లో ఉదయం నుంచి వానలు పడ్డాయి. అల్లూరిజిల్లా చింతూరు ఏజెన్సీలో జోరుగా వానలు కురుస్తున్నాయి. దాంతో శబరినది ఉప్పొంగి ప్రవహిస్తోంది. చింతూరు వద్ద 29 అడుగులకు వరదనీరు చేరింది. సోకిలేరు వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. చింతూరువీఆర్‌పురం మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

## కాంగ్రెస్ జోష్ కు బ్రేక్

కాంగ్రెస్ పార్టీలోకి చేరడం కొనసాగుతూనే ఉంది. గాంధీ భవన్ లో నిత్య కళ్యాణ శోభ పరిఢవిల్లుతోంది. అయితే కాంగ్రెస్ పార్టీలో అంతర్గతంగా ఏమి జరుగుతోంది అనే విషయం పక్కన పెడితే ఓ వంక చేరికలతో మంచి ఊపు మీదున్న తెలంగాణ కాంగ్రెస్ కు ఇప్పుడు చిన్న షాక్ తగిలింది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఆ పార్టీకి షాకిస్తూ, యాదాద్రి డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ ను వీడి బీఆర్ఎస్ గూటికి చేరారు. ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర రావు సమక్షంలో ఆయన గులాబీ కండువా కప్పుకున్నారు. అంతకు ముందు ఆయన స్థానిక భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డితో కలిసి హైదరాబాద్‌లో మంత్రి జగదీష్ రెడ్డిని కలిశారు. అనంతరం బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. కాగా భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీరుపై కుంభం అనిల్ అసంతృప్తిగా ఉన్న విషయం తెలిసిందే.నిజానికి, కర్ణాటక గెలుపు, పొంగులేటి, జూపల్లి చేరికలతో కాంగ్రెస్ పార్టీలో జోష్ పెరిగినా తెలంగాణలో హస్తం పార్టీ రాజకీయాలకు ఉమ్మడి నల్గొండ జిల్లానే కీలకం. ఈ నేపథ్యంలో కుంభం అనిల్ కుమార్ రెడ్డి చేయి వదిలి, కారెక్కడం సంచలనంగా మారిందనే చెప్పాలి. అంతే కాదు నల్గొండ జిల్లాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుల్లో కోమటి రెడ్డి, రెంత్ రెడ్డి జోడీపై పెరుగుతున్న అసంతృప్తికి అనిల్ రెడ్డి బీఆర్ఎస్ లో చేరడం ఒక సంకేతంగా భావిస్తున్నారు. కాగా భువనగిరి కాంగ్రెస్‌లో ఎంపీ కోమటిరెడ్డి వర్సెస్ డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మధ్య వర్గ పోరు సాగిన విషయం తెలిసిందే. తనకు వ్యతిరేకంగా కోమటిరెడ్డి గ్రూప్ రాజకీయాలు ప్రోత్సహిస్తున్నారని, నియోజకవర్గంలో తన ఓటమికి రహస్య మంతనాలు చేస్తున్నారని అనిల్ పలుమార్లు ఆరోపించారు.అయితే ఆరోపణలు చేసింది అనిల్ కుమార్ రెడ్డి అయినా చేయించింది మాత్రం ... కోమటి రెడ్డి అనూహ్యంగా రేవంత్ రెడ్డితో చేతులు కలపడాన్ని జీర్ణం చేసుకోలేని సీనియర్ నాయకులే అని అంటున్నారు. అందుకే అనిల్ కుమార్ రెడ్డి రెడ్డి బీఆర్ఎస్ లో చేరడాన్ని కేవలం చేరిక వ్యవహారంగానే చూడరాదని తెర వెంక కాంగ్రెస్ మార్క్ రాజకీయం నడుస్తోందని అంటున్నారు.

## కాంగ్రెస్ గూటికి జిట్టా

ఆహ్వానం అందిందని కూడా చెప్పుకొచ్చారు. అనుచరులతో చర్చించి త్వరలోనే నిర్ణయం తీసుకుంటానని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలు నెరవేరుతాయనే బీజేపీలో చేరానన్న ఆయన... తాను కార్యకర్తగా మాత్రమే ఆ పార్టీలో ఉన్నానని కామెంట్స్ చేశారు. బీజేపీలోనే గ్రూపు రాజకీయాలు ఎక్కువయ్యాయని అన్నారు. ఇతర పార్టీల్లో ఉన్న నేతలపై కూడా ఆయన ఫైర్ అయ్యారు. ఎంపీ కోమటిరెడ్డిని అనే అంత స్థాయి అనిల్ కుమార్ రెడ్డికి లేదన్నారు. వీటన్నింటిని చూస్తే... జిట్టా బాలకృష్ణారెడ్డి పార్టీ మారే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. దీనిపై త్వరలోనే అధికారికంగా ప్రకటన వచ్చే ఛాన్స్ ఉంది.భువనగిరి నియోజకవర్గంలో జిట్టా బాలకృష్ణారెడ్డికి మంచి గుర్తింపు ఉంది. తెలంగాణ ఉద్యమంలో యాక్టివ్ గా పని చేసిన ఆయన... టీఆర్ఎస్ నుంచి రాజకీయంగా అవకాశాలు దక్కలేదు. కొన్నిసార్లు ఆ అవకాశం వచ్చినప్పటికీ... పొత్తుల కారణంగా దక్కలేదు. 2009 ఎన్నికల్లో టీఆర్ఎస్ , టీడీపీ పొత్తు పెట్టుకోవటంతో జిట్టాకు టికెట్ దక్కలేదు. ఈ టైంలోనే ఆయన పార్టీని వీడటమే కాదు... రెబల్ అభ్యర్థిగా కూడా బరిలో నిలిచారు. స్వతంత్రం అభ్యర్థిగా పోటీ చేసి.... సెకండ్ ప్లేస్ లో నిలిచారు. ఇక రాష్ట్ర ఏర్పాటు తర్వాత జరిగిన ఎన్నికల్లో కూడా... స్వతంత్ర అభ్యర్థిగానే బరిలోకి దిగారు జిట్టా బాలకృష్ణారెడ్డి. 39వేలకు పైగా ఓట్లు సాధించిన ఆయన... ఈసారి కూడా రెండో ప్లేస్ లో నిలిచారు. 15వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఆ తర్వాత యువ తెలంగాణ పార్టీని ప్రకటించారు జిట్టా. 2018 ఎన్నికల్లో పోటీ చేసి... కేవలం 13 వేల ఓట్లు సాధించి మూడో ప్లేస్ లో నిలిచారు. ఆ తర్వాత పార్టీని బీజేపీలో విలీనం చేసి... కాషాయ కండువా కప్పుకున్నారు. ప్రస్తుతం అదే పార్టీలో కొనసాగుతున్నప్పటికీ.... తగిన గుర్తింపు లేదన్న అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది.ఈ మధ్యనే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ ను వీడటంతో... జిట్టాను పార్టీలోకి తీసుకురావాలని కాంగ్రెస్ చూస్తోంది. ఫలితంగా కేడర్ లోకి ఓ బలమైన సందేశాన్ని ఇవ్వాలని భావిస్తోంది. ఇప్పటికే చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. ఇక ఆయన చేరితే... అసెంబ్లీ బరిలో ఉంటారా..? లేక పార్లమెంట్ సీటుకు సంబంధించి ఏమైనా హామీ ఇస్తారా అనేది చూడాలి...!

# అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫెరెన్స్

**జయభేరి, వరంగల్ :**



జిల్లాలలో గత రెండు రోజులుగా కురుస్తున్నభారీ వర్షాల కారణంగా జిల్లాల స్థితి గతులను తెలుసుకోవడం, అలాగే ప్రజలను అప్రమత్తం చేసేందుకు జిల్లా కలెక్టర్లకు తగు చర్యల నిమిత్తం హైదరాబాదు నుండి సిఎస్ శాంతి కుమారి జిల్లా కలెక్టర్లతో సెల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, మునిసిపల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ పాషా, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. తరువాత కలెక్టర్ సంబంధిత జిల్లా అధికారులు తహశీల్దార్లతో అన్నీ మండలలో నెలకొన్న పరిస్థితి ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...గత 48 గంటల నుండి వర్షాల నేపథ్యంలో అన్నీ శాఖల అధికారులు అలర్ట్ గా ఉండి సమన్వయం గా పని చేస్తున్నారని అభినందించారు. దెబ్బతిన్న ఇళ్ల వివరాలు, కోతకు గురైన రోడ్ లు , కల్వర్టు ల పరిస్థితి, నిండిన చెరువుల వివరాలు, ప్రాణ, పంట నష్టం వివరాలు, తాగు నీటి సరఫరా, కరెంట్ పోల్స్, ట్రాన్సఫార్మర్ల డ్యామేజ్ తదితర అంశాల పైన అన్నీ మండలాల తహసీల్దార్ లతో గూగుల్ మీట్ ద్వారా కలెక్టర్ మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఖానాపురం మండల కు సంబందించి 16 ఇళ్ళు పాక్షికంగా దెబ్బ తిన్నాయని, 24 చెరువులు నిండి పోయాయాని.. అన్నీ ఓవర్ ఫ్లో అవుతున్నాయని.., 24 అడుగుల నీటి మట్టం తో పాఖలా చెరువు నిండి ఉందని... ప్రస్తుతానికి ఎలాంటి ప్రమాదం లేదని తహసీల్దార్ చెప్పారు. నర్సంపేట కి సంబందించి చిన్న, పెద్ద చెరువులు కలిపి 69 ఉన్నాయని... మాదన్నపేట చెరువు ఫీట్ న్నర మత్తడి పోస్తుందని... 10 ఇళ్ళు దెబ్బతిన్నాయని.. ఇందుకు సంబందించి బిల్స్ సబ్మిట్ చేశామని... మగ్ధంపురం, గురిజాల వద్ద రోడ్ బ్లాక్ చేశామని ప్రజలను అప్రమత్తం చేశామన్నారు. వర్ధన్నపేట కు సంబందించి 11 ఇళ్ళు పాక్షికంగా దెబ్బ తిన్నాయని.. ఇప్పల కుంట , పెరుమాండ్ల కుంట చెరువు కట్టలు తెగిపోయాయని... 68 చెరువులకు గాను 58 చెరువు లు పూర్తి స్థాయిలో నిండాయని.. అందులో 15 చెరువులు ఓవర్ ఫ్లో అవుతున్నాయాన్నారు. ఆకేరు వాగు ఉదృతం గా ప్రవేహిస్తున్నాదని... ఇల్లంద లో 16 ఇళ్ల లకు నీరు చేరాయని.. గత నాలుగు రోజుల నుండి బాధితులకు భోజనాలు ఆరెంజ్ చేశామని తహసీల్దార్ తెలిపారు. ఆకేరు వాగు, కాజ్ వే ల దగ్గర విఆర్ఏ లను, పోలీస్ సిబ్బంది ని పెట్టాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేసారు. వరద నీరు ఆగి ఉండకుండా చేయాలని.... ఆ తరువాత శానిటేషన్ ప్రక్రియను సరిగ్గా నిర్వహించాలన్నారు. దోమలు ప్రభలకుండా నివారణ చర్యలు తీసుకోవాలని డీపీఓ ని కలెక్టర్ ఆదేశించారు. తాగు నీటి సరఫరా కు ఎలాంటి అవంతరాయం లేకుండ చూడాలని మిషన్ భగీరథ అధికారులకు తెలిపారు. ప్రజలు కూడా చాలా అప్రమత్తం గా ఉండాలని.. వరద నీరు ప్రవహిస్తున్న రోడ్ ల వద్దకు రాకూడదని... అత్యవసరం అయితేనే బయటికి రావాలని కలెక్టర్ సూచించారు. జిల్లా లో కురుస్తున్న వర్షాల వలన లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. లోతట్టు ప్రాంతాలలో శిదిలావస్థలో ఉన్న ఇండ్లలో నివసిస్తున్న వారిని గుర్తించి పునరావాస కేంద్రాలకు తరలించాలని అన్నారు. పునరావాస కేంద్రాలలో.నివసించే ప్రజలకు బోజన వసతులు కల్పించేందుకు ఏర్పాటు చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలోని లోతట్టు ప్రాంతాల్లోని కాజ్ వేలు, చెరువులు ప్రమాదఘటికలు ఉన్న ప్రాంతాలకు పిల్లలు సరదాగా సెల్ఫిలకోసం వెళ్లుటకు ప్రయత్నాలు చేస్తారు.. ఎట్టి పరిస్థితులలో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఇంటి నుంచి పిల్లలను బయటకు వెళ్ళ కుండా చూసుకోవాలని, అదే విధంగా పోలీసు యంత్రాంగం, రెవెన్యూ అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

జిల్లాలో కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలలో రోడ్లు దెబ్బతిని, రోడ్లు అన్ని జలమయం అయిన ప్రాంతాలను గుర్తించి ,రోడ్డు డైవర్షన్ ఏర్పాట్లను ఎప్పటికప్పుడు మీడియా ద్వారా లోకల్ చానల్స్ లో స్క్రోలింగ్ ఇవ్వాలని కలెక్టర్ అన్నారు. ప్రమాదం అవకాశాలు ఉన్నా ప్రాంతాలలో ప్రమాద హెచ్చరికలు, కాషన్ బోర్డ్స్ లు ఏర్పాటు చేయవలసిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు.

# పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు

**జయభేరి, ఖమ్మం :**




తెలంగాణతో పాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు రాష్ట్రంలోని వాగులు, వంకలు, జలపాతాలన్నీ పొంగి పొర్లుతున్నాయి. ముఖ్యంగా గోదావరి నది అయితే ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. దీంతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతూ వస్తోంది. నిన్న వరకు 39 అడుగుల వద్ద ప్రవహించిన గోదావరి నది ఈరోజు ఉదయానికి 40 అడుగులకు చేరుకుంది. మధ్యాహ్నం 3 గంటలకు 44.4 అడుగులకు చేరుకోగా.. అప్రమత్తమైన అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. భద్రాచలం ఎగువన ఉన్న తాలిపేరు ప్రాజెక్టు నుంచి 23 గేట్లు ఎత్తి లక్షా 80 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. నీటిమట్టం మరింత పెరిగితే ఈరోజు రాత్రి వరకు రెండో ప్రమాద హెచ్చరికను కూడా జారీ చేసే అవకాశం ఉందని అధికారులు వివరిస్తున్నారు. నీటిమట్టం 43 అడుగలకు చేరితే మొదటి ప్రమాద హెచ్చరిక, 48 అడుగులకు చేరితే రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. భారీగా వర్షాలు కురుస్తుండడంతో గోదావరి నది పరివాహక ప్రాంత ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఏవైనా సమస్యలు, ఇబ్బందులు ఏర్పడితే అత్యవసర సేవలకు కంట్రోల్ రూమ్ కి ఫోన్ చేయాలని, ప్రజలు ఇళ్లన నుంచి బయటకు రావొద్దని సూచించారు. వర్షాల వల్ల పొంగి పొర్లుతున్న వాగులు దాటొద్దని అన్నారు. అలాగే ప్రజలందరూ అధికారులు చెప్పే సూచనలు కచ్చితంగా పాటించాలని అప్పుడే ఎలాంటి ఇబ్బందుల పాలవరని వివరించారు. ఎప్పటికప్పుడు అధికారులు అప్రమత్తమవుతూ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అల సూచించారు.

అలాగే భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య గోదావరి కరకట్ట ప్రాంతం వద్ద విస్తా కాంప్లెక్స్ ఏరియాలో మోటార్ల ద్వారా బ్యాక్ వాటర్ ను తొలగించే ప్రాంతాన్ని పరిశీలించారు. రామాలయం ఏరియాలో కొత్త కాలనీలో వరద నీరు చేరకుండా అధికారులు ఎప్పటికప్పుడు బ్యాక్ వాటర్ ను మోటార్ల ద్వారా తొలగించాలని అధికారులకు సూచించారు. అలాగే ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అత్యవసం అయితే తప్ప వర్షంలో బయటకు రాకూడదని సూచించారు. మహబూబాబాద్ లో కూడా పెద్ద ఎత్తున వర్షాలు కురుస్తుండడంతో ఏజెన్సీ గ్రామాల్లోని వాగులు, వంకలన్నీ ఉరకలెత్తుతున్నాయి. కుండపోత వర్షాల కారణంగా రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

జిల్లాలోని కొత్తగూడ మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు చెరువులు, నిండుకుండలా మారాయి. కొత్తపల్లి వైపు వెళ్లే బుర్కపల్లి వాగు పొంగడంతో రహదారిపై వాహనాలు అన్నీ నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించిపోయింది. వేలుబల్లి కతర్ల వాగు సైతం పొంగుతోంది. నర్సంపేట నుంచి కొత్తగూడ వైపు వెళ్లే దారిలో గాదెవాగు గుంజేడుతోగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. కొత్తపల్లి మండలంలోని గాంధీ నగర్ లో గత రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మోదె నరసమ్మ అనే వృద్ధురాలు ఇల్లు కూలిపోవడంతో ఆ కుంబం మొత్తం నిరాశ్రయులు అయ్యారు.

గూడూరు మండలం కొమ్ముల వంచ శివారులో భీముని పాదం జలపాతం భారీ వర్షాలకు ఉద్ధృతంగా పొంగుతోంది. పర్యాటకులు జలపాత సందర్శనానికి రాకూడదని అటవీ శాఖ అధికారులు హెచ్చరిక బోర్డులు పెట్టారు.

# సీబీఐ చేతికి.. మణిపూర్ వైరల్ వీడియో కేసు



మణిపూర్ వైరల్ వీడియోకు సంబంధించిన కేసును సీబీఐకి అప్పగిస్తున్నట్టు సుప్రీంకోర్టుకు తెలిపింది కేంద్రం. ఈ మేరకు ఓ అఫిడవిట్ను దాఖలు చేసింది. మణిపూర్లో ఇద్దరు మహిళలను నగ్నంగా చేసి ఊరేగించిన సంఘటనకు సంబంధించిన కేసును సీబీఐ (కేంద్ర దర్యాప్తు సంస్థ)కి అప్పగించింది కేంద్ర ప్రభుత్వం. ఈ మేరకు.. సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్లో పేర్కొంది. ఈ కేసుకు సంబంధించిన విచారణను, మణిపూర్ బయట నిర్వహించాలని కేంద్రం భావిస్తున్నట్టు తెలుస్తోంది.

**అఫిడవిట్లో ఉన్న వివరాలు..**

ఈ ఏడాది మే 3 మణిపూర్లో నిరసనలు మొదలయ్యాయి. కాగా.. మే 4న కుకి జాతికి చెందిన ఓ గ్రామంపై దాడి చేసిన దుండగులు.. ఇద్దరు మహిళలను నగ్నంగా చేసి, ఊరేగించారు. ఓ ఫేక్ వీడియోను చూసి, కోపంతో ఈ దారుణానికి ఒడిగనట్టు తెలుస్తోంది. బాధితుల్లో ఒకరిపై సామూహిక అత్యాచారం కూడా జరిగినట్టు తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు జులై 20 ప్రాంతంలో బయటకొచ్చాయి. ఫలితంగా ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. నిందితులను కఠినంగా శిక్షించాలని సర్వత్రా డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. పార్లమెంట్ వేదికగా ప్రధాని మోదీ ఈ వ్యవహారంపై స్పందించాలని విపక్షాలు పట్టుబడుతున్నాయి. సుప్రీంకోర్టులో ఉన్న మణిపూర్ వీడియో కేసుకు సంబంధించి అఫిడవిట్ను దాఖలు చేసింది కేంద్ర ప్రభుత్వం. "నిందితులను పట్టుకునేందుకు అనేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశాము. ఈ కేసు దర్యాప్తు బాధ్యతను ఎస్పీ ర్యాంక్ అధికారికి అప్పగించాము. ఇతర సీనియర్ అధికారుల పర్యవేక్షణలో ఈ కేసు దర్యాప్తు ముందుకు సాగుతోంది. ఇప్పటివరకు ఏడుగురిని అరెస్ట్ చేశాము. చివరిగా.. ఓ వ్యక్తిని సోమవారం అరెస్ట్ చేశాము. దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని నిర్ణయించుకున్నాము." అని అఫిడవిట్లో పేర్కొంది కేంద్రం. "మహిళలపై నేరాలను కేంద్రం సహించబోదు. మణిపూర్లో జరిగింది అత్యంత ఘోరమైన ఘటన అని కేంద్రం భావిస్తోంది. దీనిని తీవ్రంగా పరిగణించడమే కాకుండా.. బాధితులకు న్యాయం చేయాల్సిన అవసరం కూడా ఉంది," అని కేంద్రం స్పష్టం చేసింది. మరోవైపు మణిపూర్ వైరల్ వీడియో ఘటనపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ఇండియాలో మానవ హక్కులపై ఆందోళన వ్యక్తం చేస్తూ.. యూరోపియన్ పార్లమెంట్ ఓ తీర్మానాన్ని ఆమోదించింది. దీనిని కేంద్రం తిప్పికొట్టింది. ఇది భారత దేశ అంతర్గత విషయం అని, ఎవరూ జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పింది.



# భారీ వర్షాలకు కూలిన ఇల్లు

**జయభేరి, రంగారెడ్డి :**

రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ అత్తాపూర్ డివిజన్లో హైదర్ గూడ లో గత వారం రోజులుగా భారీగా వర్షం కురవడంతో దళిత బస్తీలోని జనార్ధన్ అనే వ్యక్తి ఇల్లు ఒక్కసారిగా వర్షం కారణంగా ఒకవైపు గోడలు పడిపోయాయి. గురువారం ఉదయం కూలి పనికి వెళ్లిన తర్వాత ఒకసారిగా గోడకూలి పడడంతో నిత్యవసర సరుకులు తోపాటు ఇంట్లో ఉన్న వస్తువులు కూడా డామేజ్ కావడంతో స్థానికులు అంతా వెంటనే అక్కడికి వెళ్లి చూసేసరికి ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో ఈ ఘటన జరగడంతో ఎవ్వరికి ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని స్థానికులంతా వెంటనే స్థానిక కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్ కి సమాచారం అందజేశారు సంఘటన స్థలానికి వచ్చిన కార్పొరేటర్ అధికారులకు సమాచారం అందజేసింది.



## మైనార్టీల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం

**జయభేరి, ఉప్పల్ :**

తెలంగాణలో నిరుపేద ముస్లిం, క్రీస్టియన్ మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సందర్భంగా చిలుకనగర్ డివిజన్లోని కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ గారిని డివిజన్ కి చెందినటువంటి మైనార్టీలు ఈరోజు వార్డు కార్యాలయంలో కలిసి లబ్ధిదారులకు తమ ద్వారా కుట్టు మిషన్లు ఇప్పించాలని కోరగా, ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి గారి సహకారంతో లబ్ధిదారులు అందరు కుట్టుమిషన్లు అందజేస్తామని అన్నారు. ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి డివిజన్లోని అర్హులైన లబ్ధిదారుల యొక్క దరఖాస్తులను అందజేసి లబ్ధిదారులకు కుట్టు మిషన్లో అందేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గారు మాట్లాడుతూ 'కేసీఆర్ కానుక' పేరుతో రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ ద్వార కుట్టు మిషన్లు పంపిణీ చేయబోతున్నట్లు డివిజన్లోని అర్హులైన మైనార్టీ లబ్ధిదారులకు అందరికీ కుట్టు మిషన్లు అందేలా కృషి చేస్తామని అన్నారు.తెల్లరేషన్ కార్డు కలిగి ఉన్న ముస్లిం, క్రీస్టియన్స్ మహిళలకు,. ఒంటరి మహిళలు, వితంతువులకు, నిరుపేద మహిళలకు తొలి ప్రాధాన్యం ఇవ్వబడుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మహిళా మైనార్టీ నాయకురాలు శేహనాజ్ , మైనార్టీ లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


# వరదలు...కష్టాలు

## రంగం లోకి దిగుతున్న ఎన్ డీ ఆ ఎఫ్ బృందాలు

**జయభేరి, వరంగల్, అదిలాబాద్:**



ములుగు జిల్లా వెంకటాపురం మండలం వీరభద్రవరం గ్రామ సమీపంలోని ముత్యంధార జలపాతాల సందర్శనకు వెళ్లిన 82 మంది పర్యాటకులు ఊహించని ఆపదలో చిక్కుకున్నారు.. 8 గంటల పాటు కారడివిలో, కుండపోత వర్షంలో ఆహాకారాలు చేశారు.. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ గడిపిన పర్యాటకులు చివరకు ఎన్ డీ ఆ ఎఫ్ బృందాలు, పోలీసులు సాహసంతో మృత్యుంజయులయ్యారు. సెలవు దినం కావడంతో తెలంగాణ రాష్ట్రంతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పలువురు పర్యటకులు ములుగు జిల్లాలోని జలపాతాల సందర్శనకు వెళ్లారు.. వారిలో కొందరు వీరబద్రవరం గ్రామ సమీపంలోని ముత్యంధార జలపాతాల సందర్శన కోసం వెళ్లారు.. అక్కడ జలపాతాల్లో జలకాలాడి ఫుల్ గా ఎంజాయ్ చేశారు.. కానీ ఆ పర్యాటకులు తిరుగు ప్రయాణంలో ఊహించని ఆపదలో చిక్కుకున్నారు.. మార్గ మధ్యలో గగ్గేని వాగు ఉప్పొంగింది.. మధ్యలో మరో రెండు కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.. దీంతో పర్యాటకులు అడవిలో చిక్కుకున్నారు.. దిక్కుతోచని స్థితిలో ఆహాకారాలు చేశారు.. మొత్తం 82 మంది అడవిలో చిక్కుకోగా వారిలో కేవలం ఇద్దరి సెల్ ఫోన్లు మాత్రమే పనిచేశాయి.. ఈ క్రమంలో అడవిలో ఆపదలో చిక్కుకున్న విషయాన్ని మంత్రి కేటీఆర్, జిల్లా కలెక్టర్, ఎస్పీ ఇతర ఉన్నతాధికారులకు తెలియజేశారు. వారి



ఫ్రెండ్స్ కు తెలియ పర్చారు.. ఈ క్రమంలో ప్రభుత్వ యంత్రాంగం వెంటనే సహాయక చర్యలు చేపట్టింది.. ఎన్ డీ ఆ ఎఫ్ బృందాలను రంగంలో దింపారు.. జిల్లా కలెక్టర్, SP అర్ధరాత్రి వరకు అక్కడే వుండి రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు.. కుండపోత వర్షంలో అతికష్టం మీద ఎన్ డీ ఆ ఎఫ్ బృందాలు సంఘటన స్థలానికి చేరుకున్నాయి.. మార్గమధ్యలో వరద ఉప్పొంగి ప్రవహిస్తున్న రోప్ సహాయంతో అడవిలోకి వెళ్లి వారిని కాపాడారు.82 మందిని సురక్షితంగా వీరభద్రవరం చేర్చారు..వారికి అక్కడ భోజనాలు ఏర్పాటుచేసి తిరిగి స్వగ్రామాలకు పంపారు.. వారిని కాపాడడం కోసం కృషిచేసిన మంత్రులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.. ప్రాణాలు తెగించి వారి కాపాడిన గ్రామస్తులు, ఎన్ డీ ఆ ఎఫ్ బృందాలు, పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు. అడవిలో ఎనిమిది గంటలపాటు నరకం అనుభవించామని గుర్తు చేసుకుంటూ నవ్వైద్వెగానికి లోనయ్యారు.. ఇది మాకు పునర్జన్మన్నారు. మొత్తం మీద ఆపరేషన్ సక్సెస్ అయి ఆ 82 మంది సురక్షితంగా బయట పడడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకున్నారు.

**మంచిర్యాలలోఆరుగురు**

ఐకమత్యమే మహాబలం అన్న మాటను అక్షరాల నిజం చేశారు ఆ కార్మికులు. భారీ వర్షాలతో వరద ఉధృతి పెరగడంతో త్వరగా ఇళ్లు చేరాలన్న ఆతృతతో ఉధృతితో పారుతున్న వాగునుదాటే ప్రయత్నం చేశారు ఆరుగురు వ్యక్తులు. కానీ వాగు వరద ప్రవాహం మరింత పెరగడంతో వరదలో చిక్కుకున్నారు. వరద ఉధృతికు కొట్టుకుపోయే ప్రమాదంలో ఒకరి చేతులు ఒకరు పట్టుకుని ఐక్యమత్యంతో బతుకు జీవుడా అంటూ ఒడ్డు చేరారు. ఈ ఘటన మంచిర్యాల జైపూర్ మండలం పెగడపల్లివద్ద చోటు చేసుకుంది. జైపూర్ ఎన్టీపీసీ ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న పెగడపల్లికి చెందిన ఆరుగురు కార్మికులు డ్యూటీ ముగించుకుని సాయంత్రం ఇంటికి బయలు దేరారు. అదే సమయంలో పెగడపల్లి వాగుకు వరద పోటెత్తింది.నిత్యం రాకపోకలు సాగించే వాగే కావడంతో ధైర్యంగా ఆరుగురు వాగు దాటే ప్రయత్నం చేశారు. మధ్యలో వెళ్లగానే వరద ఉధృతి పెరగడంతో ఇద్దరు కార్మికులు వరదలో కొద్ది దూరం కొట్టుకుపోయారు. వెంటనే అలర్ట్ అయిన మిగిలిన కార్మికులు వరదలో కొట్టుకుపోతున్న కార్మికులను గట్టిగా పట్టుకుని కాపాడారు. వరద ఉధృతి అంతకంతకు పెరగడంతో ముందుకు వెళ్లలేమని నిర్ణయించుకున్న ఆరుగురు కార్మికులు ఒకరి చేతులు ఒకరు పట్టుకుని జాగ్రత్తగా తిరిగి వెనక్కి వెళ్లిపోయారు. ఎట్టకేలకు ఒడ్డుకు చేరి ప్రాణాలు కాపాడుకోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు



## డబల్ బెడ్ రూమ్స్ ఇండ్లు బాధితులకు దక్కేవరకు...

**జయభేరి, మేడిపల్లి :**

మేడిపల్లి మండలం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పర్వతాపూర్ 60 గజాల ప్లాట్లు కోల్పోయిన వారికి ఆ స్థలంలోనే డబల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇస్తామని చెప్పి ఇప్పుడు ఇవ్వకపోవడంతో ధర్నా చేస్తున్న బాధితులకు అండగా సిపిఐ పార్టీ మేడిపల్లి మండల ప్రధాన కార్యదర్శి రచ్చ కిషన్. సందర్శించి బాధితులకు సంఘీభావం తెలపడం జరిగినది. రచ్చ కిషన్ మాట్లాడుతూ 2007 సంవత్సరంలో బాధితులకు 60 గజాల ప్లాట్లు ఇచ్చి తర్వాత అదే స్థలం లో డబల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మాణం చేసి మీకే ఇస్తామని చెప్పి ఇప్పుడు అట్టి బాధితులకు ఇవ్వకుండా అధికార పార్టీ నాయకులు బయట వ్యక్తులకు ఇవ్వడం. ఇది చాలా బాధాకరమని వ్యక్తం చేశారు. డబల్ బెడ్ రూమ్ లక్కీ డ్రా ఎవరైతే అర్హులను గా గుర్తించారు. వారి ముందే ఈ లక్కీ డ్రా తీయాలని డిమాండ్ చేశారు. లక్కీ డ్రా తీసిన తర్వాత 6 నెలల తర్వాత రెవెన్యూ అధికారులు ఎలాంటి హడావుడి చేయకుండా ఇవ్వడం పలు అనుమానాలకు దారితీస్తుంది అన్నారు.మంత్రి మల్లారెడ్డి గారు చిన్న కార్యక్రమాన్ని కూడా వదలకుండా వచ్చి పాల్గొనే మంత్రిగారు, అలాగే బిఆర్ఎస్ పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టిస్తున్న ఈ కార్యక్రమం మంత్రి మల్లారెడ్డి గారి చేతుల మీదుగా పంచకుండా? రెవెన్యూ అధికారులు ఎలాంటి హడావుడి లేకుండా డబుల్ బెడ్ రూమ్ ఇవ్వడం చాలా అనుమానాలకు దారి తీస్తుంది అన్నారు. వెంటనే అర్హులైన వారి ముందే ఈ డ్రా తీసి నిజమైన లబ్ధిదారులకు డబల్ బెడ్ రూములు పొందే వరకు సిపిఐ పార్టీ అండగా ఉంటుందని తెలియజేస్తున్నాము. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు ఏఐటీయూసీ మండల కార్యదర్శి దండు రమేష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



## పేద ప్రజలకు ఆహార ప్యాకెట్లు పంపిణీ

**జయభేరి, మేడిపల్లి :**

మేడ్చల్ జిల్లా కేంద్రంలోని మేడ్చల్ నియోజకవర్గం పరిధిలో గల మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలో గౌరవ తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి వర్యులు శ్రీ మల్లారెడ్డి యువసేన ఆధ్వర్యంలో మేడ్చల్ అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ బాసురాది భాస్కర్ యాదవ్ ఆధ్వర్యంలో గత మూడు, నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా బయటకు వచ్చే పరిస్థితి లేకుండా ఉన్నందున పేద ప్రజలు, గుడిసెలల్లో ఉండే బీద వారు తినడానికి తిండి లేక ఇబ్బందులు పెడుతున్నారని గ్రహించిన మల్లారెడ్డి యువసేన ఆధ్వర్యంలో పేద ప్రజలకు ఆహార ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ బాసురాది భాస్కర్ యాదవ్, మేడ్చల్ మున్సిపల్ కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ మాట్లాడుతూ... అతి భారీ వర్షాలు కురుస్తున్న సందర్భంగా ప్రజలు అత్యవసర సమయంలో మాత్రమే బయటకు రావాలని ఇలాంటి సమయంలో తోటి వారికి సహాయం అందించడం ప్రతీ ఒక్కరి బాధ్యత అన్నారు. ఇలాంటి సమయంలో ముందుకొచ్చి బాధితులకు బాసటగా నిలవాల్సిన బాధ్యత మనం అందిరిపై ఉందన్నారు. పేద ప్రజలకు వర్షాల బాధితులను ఆదుకునే తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బాసురాది భాస్కర్ యాదవ్ తో పాటు మేడ్చల్ మండల బీ ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు చీర్ల దయానంద్ యాదవ్, మేడ్చల్ మున్సిపల్ కౌన్సిలర్స్ కౌడే మహేష్ కురుమ, బత్తుల శివ కుమార్ యాదవ్, మేడ్చల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉదండపురం సత్యనారాయణ, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఒగ్గు శంకర్ కురుమ, బీ ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దుర్గం వెంకటేష్ ముదిరాజ్, లద్దిపీర్ల రవీందర్ గౌడ్, మల్లారెడ్డి యువసేన సభ్యులు, బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## వరద ప్రభావిత ప్రాంతాల్లో చర్యలు చేపట్టండి



**జయభేరి, హైదరాబాద్ :**

మంత్రి కేటీఆర్ కు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి బహిరంగ లేఖ రాసారు. గ్రేటర్ హైదరాబాద్ లో వరదలు, సహాయక చర్యలపై లేఖలో ప్రశ్నించారు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో హైదరాబాద్ నగరం విలవిలలాడుతోంది. లోతట్టు ప్రాంతాల పరిస్థితి మరీ దయనీయంగా తయారైంది. ప్రజల గోసను పట్టించుకోవాల్సిన మీరు పత్తా లేకుండా పోయారు. పుట్టిన రోజు పండగలపై ఉన్న ఆసక్తి ప్రజల ఇబ్బందులపై లేదు విశ్వనగరంగా తీర్చిదిద్దామని సెల్ఫ్ డబ్బాలు కొట్టుకోవడానికి పోటీ పడే మీరు, ప్రజలు బయటకు రావాలంటేనే ఆలోచించుకునే దుస్థితిని హైదరాబాద్ కు కల్పించారని అన్నారు. ప్రజలు ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకుంటూ తిరిగాల్సిన పరిస్థితిని కల్పించారు. మీ అసమర్థ పాలనలో ఇది విశ్వనగరమో.. విషాద నగరమో తేలిపోయింది. ట్రాఫిక్ సమస్యలతో నగర ప్రజలు నానా యాతన పడుతున్నారు. బీఆరెస్ నేతల కబ్జాలు, అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలతోనే నగరానికి ఈ పరిస్థితి. చర్యలు తీసుకోవాల్సిన మీరు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. హైదరాబాద్ లో ఇటువంటి పరిస్థితి రాబోతుందని మేం హెచ్చరించినా పట్టించుకోలేదు. నగరంలో వరద బీభత్సం సృష్టిస్తున్నా కనీసం సమీక్ష చేసే సమయం మీకు లేదు. వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ ప్రకటించైనా.. ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. గతంలో వరదల సమయంలో మీరు చేసిన ప్రకటనలు కాగితాలకే పరిమితమయ్యాయి. అప్పట్లో ప్రకటించిన పది వేల సాయం ఎన్నికల పథకంగా మిగిలిపోయింది. ఇప్పటికైనా ప్రజల కష్టాలను తీర్చే ప్రయత్నం చేయండి. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయ చర్యలు చేపట్టండి. ప్రభావిత ప్రజలకు రూ. 10 వేల సాయం ప్రకటించండి. లేకపోతే శుక్రవారం నాడు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ కార్యాలయాన్ని ముట్టడిస్తాం. మీ చేతగానితనాన్ని ఎండగట్టి తగిన బుద్ధి చెబుదామని పేర్కొన్నారు.



## ఇళ్లల్లోకి నీరు చేరటంతో లబోదిబోమంటున్న గ్రామస్థులు

**జయభేరి, శ్రీకాకుళం :**

గార మండలం కుమ్మరిపేటలో గత రెండు రోజులుగా కురుస్తున్న వానలకు కాలనీ అంతా వర్షపు నీటితో నిండి జలాశయాలను తలపించటమే కాకుండా నీరు ఎటు వెళ్ళటానికి వీలు లేక ఇళ్లల్లోకి చేరి గ్రామస్థులకు, కాలనీవాసులకు ఇబ్బందికరంగా మారుతుందని గతంలో వర్షపు నీరు దిగువ పొలాలలోకి వెల్లేదని, ఇప్పుడు దారులు మూసుకుపోయి నీరు ఎక్కడికక్కడ ఉండిపోవడంతో మురికి పేరుకుపోయి దుర్వాసన అధికమవ్వడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఈ మురికి నీళ్లు ఇళ్లల్లోకి చేరటంతో అనేక రోగాలు కొనితెచ్చుకుంటున్నారని, పిల్లలు, పెద్దలు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ఇప్పటికైనా గ్రామ అధికారులు స్పందించి, మురికి నీళ్లు నిల్వా ఉండకుండా తక్షణ చర్యలు చేపట్టాలని కాలనీవాసులు మరియు ఊరు పెద్దలు కోరుతున్నారు.

ప్రభాత జయభేరి jayabheridaily.com




# సీఎం జగన్ రాయలసీమ ద్రోహి

## చంద్రబాబునాయుడు

**జయభేరి, అమరావతి :**

తెలుగుదేశం అధినేత, మాజీ ముఖ్యమంత్రి, ప్రధాన ప్రతిపక్ష నేత, నారా చంద్రబాబు నాయుడు గురువారం నాడు మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రాయలసీమ ద్రోహి అని ఆరోపించారు. జగన్ పోవాలి.. సీమలో సిరులు పండాలి. ఒక్క జీవోతో సీమలో 102 ప్రాజెక్టుల పనులు రద్దు చేశాడు. సీమ ప్రాజెక్టులపై 5 ఏళ్లలో టీడీపీ ఖర్చు..రూ. 12,411 కోట్లు....వైసీపీ ఖర్చు రూ. 2011 కోట్లు. సీమలో మేం కులం చూడలేదు...కరువు చూశాం. సీమ ప్రాజెక్టులపై ఖర్చు కంటే....సొంత పత్రిక ప్రకటనల ఖర్చు, సలహాదారుల జీతాల మొత్తమే ఎక్కువ. చేసిన ద్రోహానికి రాయలసీమ రైతాంతాగానికి జగన్ క్షమాపణ చెప్పాలని అన్నారు. చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో రాయలసీమ తీవ్ర నీటి ఎద్దడి ఉంటుంది. ఈ కారణంగా సీమ నీటికష్టాలు తీర్చ డానికి ఎన్.టీ.రామారావు తెలుగుగంగ ప్రాజెక్ట్ తీసుకొచ్చారు. కృష్ణా మిగులు జలాలను కరువుప్రాంతానికి అందించడంకోసం, నలుగురు ముఖ్యమం త్రులను కన్విన్స్ చేశారు. ఆ ప్రాజెక్ట్ తో తమిళనాడుకు కూడా తాగునీరు అందించారు. తెలుగుగంగ తర్వాత గాలేరునగరి, హంద్రీనీవా ప్రాజెక్టులతో మొత్తం రాయలసీమ ను సస్యశ్యామలం చేయాలని ఎన్.టీ.ఆర్ తలచారు. నేను వచ్చాక పట్టిసీమ నిర్మించి, కృష్ణా జలాలను సీమకు అందించాను. దేశమంతా ఆలోచిస్తున్న నదుల అనుసంధానం ప్రాజెక్ట్ లో ఇదొక తొలిఅడుగు. నదుల అనుసంధానం చేయగలగితే రాష్ట్రంలో ప్రతిఎకరాకు నీరుఇవ్వవచ్చని ఆలోచించి దానికి అను గుణంగా ఒక బ్లూ ప్రింట్ తయారుచేశామని అన్నారు. గోదావరి, కృష్ణా, వంశధార, నాగావళి, పెన్నా నదులతోకలిపి మొత్తం రాష్ట్రంలో చిన్నవి పెద్దవి 69 నదులు ఉన్నాయి. గోదావరిపై నిర్మించిన పోలవరం ప్రాజెక్ట్ పూర్తయితే, ఆ నీటిని నేరుగా వివిధ మార్గాల్లో ఇచ్ఛాపురం వరకు అందించేలా ప్రణాళికలు వేశాం. అదే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్ట్. మరోపక్క పోలవరం కుడికాలువద్వారా ప్రకాశం బ్యారేజీకి నీటిని తరలించి, శ్రీశైలంలోని కృష్ణా నీటిని రాయలసీమకు తరలించేలా ప్రణాళికలు తయారుచేశాం. ఇంకోపక్కన ప్రకాశం బ్యారేజీ కి వచ్చే కృష్ణానీటిని వైకుంఠపురంలో ఒక బ్యారేజీ కట్టి, అక్కడినుంచి పల్నాడుజిల్లా నకరికల్లులోని నాగార్జున సాగర్ కుడికాలువకు కలపాలని ఆలోచించాము. దీనికి సంబంధించిన పనులకు టెండర్లు కూడా పిలవడం జరిగిం ది. అదేసమయంలో బొల్లాపల్లిలో రిజర్వాయర్ కట్టి, నల్లమల ఫారెస్ట్ లో ఒక 35 కిలోమీటర్ల టన్నెల్ నిర్మిస్తే, గోదావరి నీరు నేరుగా పెన్నానదికి వెళ్తుంది. అక్కడి నుంచి నేరుగా రాయలసీమలోని అన్నిరిజర్వాయర్లకు కేంద్ర బిందువైన బనకచర్ల రిజర్వాయర్ కు నీటిని తరలిస్తే, అక్కడినుంచి కండలేరు, సోమశిలవరకు నీటిని పంపవచ్చు. ఈ మొత్తం ప్రణాళికతో నదుల అనుసంధానం మొత్తం పూర్తవుతుంది. ఈ విధమైన ఆలోచన, దూరదృష్టితో రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయాలని ఆలోచించానని అన్నారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి టీడీపీ ఐదేళ్లలో రూ.68,293కోట్లు ఖర్చుపెడితే, వైసీపీ నాలుగేళ్లలో రూ.22,165కోట్లు మాత్రమే వెచ్చించింది. మా ప్రభుత్వం మొత్తం రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి 201419లో రూ. 68,293కోట్లు ఖర్చుపెట్టింది. ఈ ప్రభుత్వం రూ.22,165కోట్లు ఖర్చుపెట్టింది. మొత్తం బడ్జెట్లో టీడీపీప్రభుత్వం 9.63శాతం నిధుల్ని సాగునీటి రంగానికి ఖర్చుపెడితే, ఈ ప్రభుత్వం 2.35శాతమే ఖర్చుపెట్టింది. ఆ నిధులు పనులు చేయడానికి కాదు.. కమీషన్లు ఇచ్చే కాంట్రాక్ట్ సంస్థలకు దోచి పెట్టారు. సాగునీటి ప్రాజెక్టుల ప్రాధాన్యత ఈ ముఖ్యమంత్రికి తెలియదు. నాటకాలు ఆడాడు. మొదటిసారి అసెంబ్లీలో మాట్లాడు తూ, గోదావరి నీటిని శ్రీశైలానికి తీసుకొస్తానని ప్రగల్భాలు పలికాడు. తెలంగాణ ముఖ్య మంత్రి ఒప్పుకున్నాడని గొప్పలు చెప్పాడని విమర్శించారు.

# నీటి పారుదల శాఖ అప్రమత్తం

## ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ కుమార్



**జయభేరి, హైదరాబాద్ :**

రాష్ట్రంలో ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్ర నీటి పారుదల శాఖ యంత్రాంగం అప్రమత్తంగా ఉందని రాష్ట్ర నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ కుమార్ తెలిపారు. అత్యధిక వర్షపాతం నమోదు వలన ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్ , వరంగల్ , ఖమ్మం జిల్లాలలో నీటి ప్రాజెక్టులకు వరద నీటి ప్రవాహం పెరుగుతుందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో 19 టెరిటోరియల్ ప్రాంతాలలో చీఫ్ ఇంజనీర్ల ఆధ్వర్యంలో నీటిపారుదల శాఖ ఆపరేషన్ బృందాలు పని చేస్తున్నాయని ఎప్పటికప్పుడు వరద పరిస్థితిని సమీక్షిస్తున్నాయని ఆయన తెలిపారు. కడెం ప్రాజెక్టుకు భారీ ఇన్ ఫ్లో ఉంది. ఈ రోజు ఉదయం తో పోలిస్తే ఇన్ ఫ్లో తగ్గిందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ ప్రాజెక్టు వద్ద నీటి పారుదల శాఖ అధికారులు, జిల్లా యంత్రాంగం, రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ ఎ.ఇంద్రకరణ్ రెడ్డి నేతృత్వంలో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారని ఆయన తెలిపారు. భద్రాచలం వద్ద ప్రస్తుతం రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోందని, భద్రాచలం పట్టణంలో వరద నీటి ప్రవాహం కట్టడి చేయడానికి భారీ మోటార్లు పెట్టి నీటిని తోడేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. రెండు హెలికాప్టర్లు కూడా సిద్ధంగా ఉంచామని. పోలవరం గేట్లు ఎత్తి ఉంచాలని సంబంధిత ప్రాజెక్టు అధికారులతో నిరంతరం మన రాష్ట్ర నీటి పారుదల శాఖ అధికారులు సంప్రదిస్తున్నారని ఆయన తెలిపారు. మిషన్ కాకతీయ ఫలితాలు ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నాయని రాష్ట్ర వ్యాప్తంగా 46 వేల చెరువులు వర్షపాతంతో జలకళతో నిండి ఉన్నాయని ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రజత్ కుమార్ పేర్కొన్నారు. కేవలం 100 లోపు చెరువులకు మాత్రమే గండ్లు పడ్డాయి వాటిని పూడ్చుతున్నామని స్పెషల్ సీఎస్ రజత్ కుమార్ పేర్కొన్నారు.

# టమోటా పంటవైపు రైతుల చూపు

**జయభేరి, హైదరాబాద్ :**



టమోటా పేరు వింటే పేద, సామాన్య ప్రజలు భయపడే స్థాయికి ధర చేరుకుంది. ఒక్కప్పుడు కేజీ టమోటా ధర రూపాయి కంటే తక్కువ పలికి రైతులను ఆత్మహత్యలపాలు చేస్తే నేడు అదే టమోటా పంట రైతును కోటీశ్వరుడిగా మారుస్తోంది. జూదం కోటీశ్వరుడిని భిక్షగాడిగానూ, భిక్షగాడిని కోటీశ్వరుడిగానూ మారుస్తుంది అనడానికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. అదే విధంగా టమోటా పంట కూడా ఒక జూదం వలె రైతును రాజుగానూ, లేదా విగత జీవిగానూ మారుస్తోంది అనడానికి అనేక ఉదాహరణలు ఉన్నాయి. ఒకనాడు టమోటా పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు అహర్నిశలు శ్రమించి పండించిన పంటను రోడ్ల పై పడేసి ఆత్మహత్య చేసుకున్న ఘటనలు చూశాము. ఇప్పుడు అదే టమోటా ధర విపరీతంగా పెరిగి రైతును కోటీశ్వరుడిగా మారుస్తోంది. గత ఒకటిన్నర నెలలుగా టమోటా కేజీ ధర విపరీతంగా పెరిగింది. టమోటాలను ఎవ్వరూ ఎత్తుకెళ్లకుండా బాడీగార్డులు పెడుతూ, బంగారు షాపుల్లో టమోటాలు విక్రయిస్తున్నట్లు ఇలా సామాజిక మాధ్యమాలలో పేరడీలు వస్తున్నాయంటే పరిస్థితి ఇట్టే అర్థం చేసుకోవచ్చు. కేజీ టమోటా ధర పది రూపాయలు పలికితే అబ్బో అనే రోజుల నుండి కేజీ టమోటా ఇప్పుడు 160 రూపాయలు పలుకుతోంది అంటే కలలో కూడా సామాన్యుడు టమోటా పేరు వింటే భయపడే పరిస్థితికి చేరుకుంది. టమాటా ధర ఉన్నట్టుండి ఒక్కసారిగా ఇంత ధర పలకడానికి అనేక కారణాలు ఉన్నాయి. దేశంలోనే టమోటా పంట అధికంగా మన మదనపల్లె ప్రాంతంలోనే సాగు చేస్తూ వచ్చే వారు. ఆ సమయంలో రైతులకు గిట్టుబాటు ధర ఉండి లాభాలు తెచ్చి పెట్టేది. దీంతో రైతులు అందరూ మిగిలిన పంటలు సాగు చేయడం మాని టమోటా సాగు వెనక పరుగులు తీశారు. ఇదే విధంగా దేశంలోని ఇతర రాష్ట్రాల్లోనూ రైతులు టమోటా సాగు పై దృష్టి సారించారు. దీంతో పంట దిగుబడి ఎక్కువ కావడం, టమోటా పంటను ఎక్కువ రోజులు నిల్వ ఉంచే పరిస్థితి లేకపోవడం, ఇందుకు తగ్గ కోల్డ్ స్టోరేజీలు తగినన్ని లేకపోవడం, దేశంలో టమోటా ఆధారిత పరిశ్రమలు తక్కువగా ఉండటంతో ఒక్క సారిగా ధర పతనావస్తకు చేరుకుంది. ప్రస్తుతం దేశంలో ఇతర రాష్ట్రాల్లో అక్కడి వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పంట సాగు లేకపోవడంతో మన ప్రాంత టమోటాలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఏర్పడింది. దీంతో ఒక్కసారిగా ధర ఆకాశాన్ని అంటింది. గత రెండు నెలలుగా వర్షాలు లేకపోవడంతో చాలా మంది రైతులు టమోటా పంటను సాగు చేయక పోవడం కూడా ఒక కారణం. ప్రస్తుతం పలుకుతున్న ధరలు ఇలానే నిలకడగా ఉంటాయా అంటే అదీ చెప్పలేని పరిస్థితి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటం, టమోటాకు మంచి ధర లభిస్తుండటంతో రైతులు ఒక్కసారిగా టమోటా సాగుకు టమోటా నార కోసం నర్సీలకు పరుగులు తీస్తున్నారు. వీరందరూ ప్రస్తుతం పంట సాగు ప్రారంభిస్తే మరో మూడు నెలల్లో అన్ని ప్రాంతాల్లో కాపు వచ్చి పంట దిగుబడి పెరిగి ధరలు తగ్గే అవకాశాలు ఉన్నాయి. అంత వరకు పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలకు టమోటా పేరు వింటే పక్కలో బాంబు పేలినంత భయం ఉంటుందనడం అతిశయోక్తి కాదు.

# ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశాం

**జయభేరి, హైదరాబాద్ :**



రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఏవిధమైన ఇబ్బందుల తలెత్తకుండా ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్లు, ఎస్.పి లు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్టు వెల్లడించారు. మేరకు భారీ వర్షాలు, వరదల వల్ల ఎదురయ్యే పరిస్థితులను ఎదుర్కోవడానికి ఎన్డీఆర్ఎఫ్, ఎస్,డీ.ఆర్.ఎఫ్, ఫైర్ తదితర శాఖల ఎమర్జెన్సీ బృందాలు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. ఇప్పటికే సచివాలయంలో వర్షాలు, వరద పరిస్థితులు, సహాయ పునరావాస కార్యక్రమాలను పర్యవేక్షించడానికి ప్రత్యేక కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ కంట్రోల్ రూమ్ లో ప్రత్యేకంగా ముగ్గురు సీనియర్ అధికారులను నియమించి పరిస్థితులను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. కంట్రోల్ రూమ్ లో 7997950008 , 7997959782 , 040 23450779 అనే నెంబర్లు ప్రత్యేకంగా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు అదేవిధంగా అన్ని జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల్లోనూ కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేశామని వెల్లడించారు. కొత్తగూడెం , హైదరాబాద్ లలో రెండు చొప్పున ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, ములుగు, వరంగల్ లో ఒక్కొక్క బృందం ఉందని తెలిపారు. రాష్ట్రంలో ప్రధానంగా ఉత్తర తెలంగాణా జిల్లాల్లో గత రాత్రి నుండి కొన్ని ప్రాంతాల్లో 40 సెంటీ మీటర్ల నుండి 30 సెంటి మీటర్ల వరకు వర్షం కురిసిందని తెలిపారు. భూపాలపల్లి జిల్లాలోని మోరంచ వాగు ఉప్పొంగడం వల్ల మోరంచపల్లి గ్రామం పూర్తిగా నీట మునిగిందని, ఈ గ్రామంలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టిందని అన్నారు. మోరంచపల్లి గ్రామానికి ఎన్డీఆర్ఎఫ్ బృందాన్ని పంపిస్తున్నామని, రక్షణ, పునరావాస చర్యలకు సహకరించేందుకు హెలికాప్టర్ కూడా పంపించేందు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. భూపాల పల్లి జిల్లా కలెక్టర్, ఎస్.పి లు మోరంచపల్లి గ్రామ ప్రజలతో మాట్లాడుతూ పరిస్థితులను స్వయంగా పర్యవేక్షిస్తున్నారని అన్నారు. అదేవిధంగా, ములుగు జిల్లా ముత్యాల ధారా జలపాతంలో చిక్కుకు పోయిన 80 మంది పర్యాటకులను రాత్రి వంటి గంట ప్రాంతంలో సురక్షితంగా బయటకు తీసుకొచ్చామని తెలిపారు. ములుగు జిల్లా కేంద్రంలోని ఒక రెసిడెన్షియల్ పాఠశాలలో నీరు చేరడంతో అక్కడి పిల్లలను ఇతర పాఠశాలలకు తరలిస్తున్నట్టు తెలిపారు. వరంగల్. హన్మకొండ పట్టణాలలో భారీ వర్షాల వల్ల అనేక కాలనీలు, బస్తీలు నీట మునిగాయని, ఈ బస్తీలనుండి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నామని తెలియ చేశారు. భద్రాచలం వద్ద గోదావరి నదీ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రెండవ ప్రమాద సూచిక జరీ చేశామని, మూడవ ప్రమాద సూచీని ఎప్పుడైనా ప్రకటించే అవకాశమున్నందున, ముంపుకు గురయ్యే గ్రాలనుండి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించేందుకు చర్యలు చేపట్టామని వివరించారు. కడెం ప్రాజెక్ట్ ద్వారా అధిక పరిమాణంలో జలాలు విడుదల అవుతున్నందున అక్కడి పరిసర ప్రాంతాల గ్రామాల ప్రజలను కూడా సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నామని సి.ఎస్ వెల్లడించారు. అన్ని జిల్లాల కలెక్టర్ల, పోలీస్ కమీషనర్లు, ఎస్.పి లతో ప్రతీ గంట గంటకు పరిస్తుతులను టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే నిండి మత్తడి పోస్తున్న చెరువులు, కుంటల వద్ద ప్రత్యేక చర్యలను చేపట్టామని, కాల్వలు, కాజ్ వే లాగుండా ప్రయాణం సాగించవద్దని ప్రజలకు సూచించారు. సచివాలయం నుండి వివిధ శాఖల కార్యదర్శులు, హెచ్.ఓ.డి లు కూడా పరిస్థితులను సమీక్షిస్తున్నారని వివరించారు.


# తిరుమలకు అంతులేని సంపద..?

**జయభేరి, తిరుమల :**

తిరుమల శ్రీ వెంకటేశ్వరుడు అలంకార ప్రియుడు. వెలకట్టలేని ఆభరణాలు, వజ్ర వైడూర్యాలు వెంకన్న సొంతం. సామాన్యుడి నుంచి సంపన్నుడి దాకా రాజులు, చక్రవర్తులు, నవాబులు, బ్రిటిష్ పాలకులు, మహంతులు, ప్రభువులు, ప్రజాప్రతినిధులు ఇలా ఎందరో విరాళాలు, కానుకలుగా సమర్పించిన విలువైన బంగారు ఆభరణాలు వెలకట్ట లేనివి. టీటీడీ రికార్డుల ప్రకారం ఖజానాలో ఉన్న ఖరీదైన ఆభరణాల బరువు 11 టన్నులు. ఈ పసిడిని టీటీడీ పలు బ్యాంకుల్లో డిపాజిట్ చేసింది. రూ. 17 వేల కోట్ల విలువైన నగదు డిపాజిట్ల రూపంలో వెంకన్న ఖాతాలో టీటీడీ పెట్టింది. 10 టన్నుల వెండి ఉండగా 11 టన్నుల బంగారం బ్యాంకుల్లో టీటీడీ డిపాజిట్ చేసింది.శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య రోజుకు దాదాపు లక్ష మందికి చేరుకోవడంతో ఆదాయం కూడా టీటీడీకి అదే నిష్పత్తిలో పెరిగింది. హుండీ కానుకలు, తలనీలాలు వివిధ సేవలు, దర్శనాలకు సంబంధించిన టిక్కెట్ల విక్రయం, ప్రసాదాల విక్రయం, గదుల కేటాయింపు, విరాళాలు మొదలైన వాటి ద్వారా టీటీడీ ఆదాయాన్ని పొందుతుంది. దేశవ్యాప్తంగా టీటీడీ 71 ఆలయాలను నిర్వహిస్తోందని, శ్రీవారికి అలంకరించే బంగారు ఆభరణాలు 1.2 టన్నుల కేజీలు ఉన్నట్లు తెలిపిన టీటీడీ, వెండి 10 టన్నుల మేర ఉన్నట్లు స్పష్టం చేసింది. ఇప్పటిదాకా రూ.17 వేల కోట్లను వివిధ బ్యాంకుల్లో డిపాజిట్ చేసిన టీటీడి 11 టన్నుల బంగారాన్ని డిపాజిట్ చేసినట్లు స్పష్టం చేసింది. అలాగే తిరుమలేశుని అలంకరణకు ఏడాదికి 500 టన్నుల పుష్పాలను వినియోగిస్తోంది. ప్రస్తుతం 24500 మంది ఉద్యోగులు విధుల్లో ఉన్నట్లు టీటీడీ పేర్కొంది. ఆలయంలో భక్తులకు సేవలందించేందుకు రోజుకు 800 మంది ఉద్యోగులు విధుల్లో ఉంటారని పేర్కొంది. శ్రీవారి ఆలయంలో ప్రసాదాల తయారీకి ఏడాదికి 5వేల టన్నుల నెయ్యిని వినియోగిస్తున్న విషయాన్ని టీటీడీ వెల్లడించింది. టీటీడీ పరిధిలో 6వేల ఏకరాల అటవీ ప్రాంతం ఉందన్న విషయాన్ని కూడా టీటీడీ ఆస్తుల చిట్టాలో పేర్కొంది.

# చంద్రయాన్ అప్ డేట్స్...

## నాలుగు లక్షల కిలోమీటర్ల ప్రయాణం.. ఆగస్టు 1 నాటికి చంద్రుడి గురుత్వాకర్షణ




**జయభేరి, బెంగళూరు :**

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రయాన్3 విజయవంతంగా ఐదు దశలను పూర్తి చేసుకుని చంద్రుడి వైపు వేగంగా కదులుతోంది. భూగురుత్వాకర్షణ పరిధిని దాటి ప్రస్తుతం చంద్రుడి వైపు సాగుతోంది చంద్రయాన్3. తదుపరి చేపట్టే దశలు అన్నీ చంద్రయాన్3 ప్రయోగానికి కీలకమే అని ఇస్రో అధికారులు చెబుతున్నారు. ఆగస్టు 1, 2023 నిర్దేశించిన ప్రకారం చంద్రుడి గురుత్వాకర్షణ పరిధిలోకి ప్రవేశించనుంది. ఈ మిషన్ లో ఇది కీలకమైన దశగా ఇస్రో శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఈ దశలో చంద్రయాన్3 చంద్రుని గురుత్వాకర్షణ పరిధిలోని కక్ష్యలోకి చేరుతుంది. క్రమంగా ఈ కక్ష్య పరిధిని కుదించుకుంటూ చంద్రునికి దగ్గరగా వెళ్తుంది. 1,27,609 కి.మీ x 236 కి.మీ కక్ష్యను చేరుకుని క్రమంగా చంద్రునికి దగ్గరగా వెళ్తుంది. అలా ఆగస్టు చివరి నాటికి చంద్రునికి 30 కిలోమీటర్ల దగ్గరి వరకు వెళ్తుంది. ఆ సమయానికి చంద్రయాన్3 చంద్రుని దక్షిణ ధ్రువ ప్రాంతానికి చేరుకున్న తర్వాత అసలు సిసలు పరీక్ష ప్రారంభం అవుతుంది. చంద్రయాన్3 రోవర్ సాఫ్ట్ ల్యాండింగ్ అవుతుంది. అనుకున్నది అనుకున్నట్లు ప్రణాళికబద్ధంగా జరిగితే చంద్రునిపై సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన నాల్గో దేశంగా భారత్ నిలవనుంది. రష్యా, అమెరికా, చైనా తర్వాత చంద్రునిపై సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన 4వ దేశంగా భారత్ రికార్డులకెక్కనుంది. చంద్రయాన్ 3ని బాహుబలి రాకెట్‌గా చెప్పిన ఇస్రో ఆ తరవాత దానికి Launch Vehicle Mark 3 గా పేరు పెట్టింది. దీని బరువు 642 టన్నులు. బరువు 3,921 కిలోలు. భూమి నుంచి చంద్రుడి వరకూ దాదాపు 4 లక్షల కిలోమీటర్ల వరకూ ప్రయాణిస్తుంది. 24 రోజుల పాటు ఇది భూమి చుట్టూ ప్రదక్షిణలు చేయనుంది. ఆగస్టు 23 లేదా 24 న చంద్రుడి ఉపరితలంపై ల్యాండ్ అవుతుందని ఇస్రో అంచనా వేస్తోంది.ల్యాండర్, రోవర్ మాడ్యూల్ వేరువేరుగా ఉన్న ఈ స్పేస్ క్రాఫ్ట్ చంద్రుడి సౌత్ పోల్ కి సమీపంలో ల్యాండ్ అవ్వనుంది. ప్రపొల్షన్ మాడ్యూల్ భూమి చుట్టూ పలుసార్లు తిరిగి చంద్రుడిపై దిగుతుంది. చంద్రుడిపై గ్రావిటీకి తగ్గట్టుగా మాడ్యూల్ మెల్లగా కిందకు దిగుతుంది. ల్యాండర్ విడిపోతుంది. లాంఛ్ అయినప్పటి నుంచి సరిగ్గా నెల రోజుల తరవాత చంద్రుడిపై మాడ్యూల్ దిగుతుంది. చైనా, రష్యాలు జంబో రాకెట్లను ఉపయోగించి చంద్రుడిపైకి ఉపగ్రహాలను పంపించాయి. చైనా, అమెరికా దాదాపు రూ.1000 కోట్ల వరకు ఖర్చు చేస్తుండగా.. ఇస్రో మాత్రం రూ.500 కోట్ల నుంచి రూ.600 కోట్లతోనే ప్రయోగం చేపడుతోంది. చంద్రుడి కక్ష్య వరకు వెళ్లే శక్తివంతమైన రాకెట్ సైతం ఇస్రో వద్ద లేకపోయినా క్లిష్టమైన ప్రక్రియలో ప్రయోగం చేపట్టింది. భారత్ సత్తా ప్రపంచమంతా చాటేలా ప్రయోగం చేసింది.ఇటలీలోని మన్సియానోకు చెందిన వర్చువల్ టెలిస్కోప్ ప్రాజెక్ట్ అంతరిక్షంలో తిరుగుతూ చంద్రుడి వైపు ప్రయాణిస్తున్న చంద్రయాన్3ను చిత్రీకరించింది. అందులో చంద్రయాన్3 ఓ చుక్కలా వేగంగా ప్రయాణిస్తోంది. భూమికి 341 కిలోమీటర్ల ఎత్తులో చంద్రయాన్3 కదలికలను వర్చువల్ టెలిస్కోప్ గుర్తించింది. ఈ వీడియో సోషల్ మీడియాలో ట్రెండింగ్ అయ్యింది. ఇటలీకి చెందిన ఈ వర్చువల్ టెలిస్కోప్ ఖగోళానికి చెందిన పలు విషయాలను ఎప్పటికప్పుడు గుర్తించి సమాచారం ఇస్తూ ఉంటుంది. చంద్రయాన్3 విషయంలోను ఈ టెలిస్కోప్ తన పనితనం, నైపుణ్యం ప్రదర్శించింది.



# ఆలయ ప్రాంగణంలోని వీరభద్రస్వామికి విశేష పూజలు

**జయభేరి, శ్రీశైలం :**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైల దేవస్థానంలో లోకకల్యాణం కోసం దేవస్థానం శుక్రవారం సాయంకాలం ఆలయ ప్రాంగణం. లోని వీరభద్రస్వామివారికి జ్వాలావీరభద్రస్వామివారికి విశేషపూజలను నిర్వహిస్తోంది. ఆలయప్రాంగణంలో మల్లికార్జునస్వామివారి ఆలయానికి ఉత్తరభాగంలో మల్లికాగుండానికి ప్రక్కనే ఉన్న వీరభద్రస్వామి జ్వాలామకుటంతో పదిచేతులతో విశిష్టరూపంలో దర్శనమిస్తాడు. శిల్పశాస్త్ర పరిభాషలో ఈ స్వామికి అఘోరవీరభద్రమూర్తి అని పేరు కూడా ఉంది. స్వామివారికి దక్షప్రజాపతి కనిపిస్తాడు. ఈ స్వామిని పరివార ఆలయాలలో భాగంగా ప్రతినిత్యం పూజించడం జరుగుతోంది. కాగా ప్రతి బుధవారం ప్రదోషకాలంలో విశేష అభిషేకం కార్యక్రమం దేవస్థానం నిర్వహిస్తోంది. ఈ పూజవలన లోకశాంతి, దుర్భిక్షనివారణ. భక్తుల అనుకున్న కోరికలు నెరవేరుతాయి. ముఖ్యంగా క్షేత్ర అభివృద్ధి జరుగుతుంది. కాగా ఈ పూజలలో ముందుగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతిపూజను . నిర్వహించబడుతుంది. తరువాత వీరభద్రస్వామికి పంచామృతాలతోనూ, పలు రకాల ఫలోదకాలతోనూ, గందోదకం, భస్మోదకం, పుష్పోదకం, బిల్వోదకం, హరిద్రోదకంతోనూ మరియు మల్లికా గుండంలోని శుద్ధజలంతో విశేష అభిషేకం నిర్వహించడం జరుగుతుంది. ఈ అభిషేకాల తరువాత విశేషంగా స్వామివారికి పుష్పార్చనను జరిపించబడుతుంది.

# అంతా తూచ్..

**పీకే ప్లాన్ లో భాగమే అంటున్న ప్రతిపక్షాలు**
**బీఆర్ఎస్ ను వెంటాడుతున్న ఓటమి భయం**
**బిఆర్ ఎస్ అధినేత మైండ్ గేమ్ లో**
**ప్రతిపక్షాలు చిత్తయ్యేనా..?**

**జయభేరి, పెద్దపల్లి :**

రాబోయే శాసనసభ ఎన్నికలకు సిద్ధమవుతున్న బిఆర్ఎస్ అధినేత సీఎం కేసీఆర్ తనదైన శైలిలో అన్ని రకాల అస్త్ర శాస్త్రాలను సిద్ధం చేసుకుంటున్నారు. తను చేయించుకున్న ప్రైవేట్ సర్వేలు, ఇంటెలిజెన్స్ నివేదికల రిపోర్టుల ఆధారంగా శాసనసభ్యుల యొక్క బలాబలాలను బేరిజు వేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. గత తొమ్మిదేళ్ల పాలనలో సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి ప్రజలను సరైన రీతిలో ఆకట్టుకోలేకపోయింది. దీంతో ఇదే అదనుగా భావించిన ప్రతిపక్షాలు తమదైన శైలిలో ప్రజలను తమ వైపు తిప్పుకోవడంలో కొంత సఫలం చెందారని చెప్పవచ్చు. కొన్ని నియోజకవర్గాల్లో అయితే ఎమ్మెల్యేల ఒంటెద్దు పోకడ వల్ల కూడా ప్రజల్లో కొంత వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తున్నది. దీనిని ప్రతిపక్షాలు తమకు అనుకూలంగా మార్చుకున్నాయి. ఈ క్రమంలోనే 2024 శాసనసభ ఎన్నికలకు ఎన్నికల కమిషన్ అన్ని రకాల చర్యలను చేపడుతున్నారు. ఇందులో భాగంగానే అధికారపక్షం అధినేత తన ప్రయత్నాల్లో తను మునిగితేలుతున్నారు. కానీ సర్వేల్లో తేలిన అంశాలను బయటకు పొక్కనీయకుండా అడుగులో అడుగు వేసుకుంటూ ముందు సాగుతున్న కూడా ఎక్కడో ఓటమి భయం వెంటాడుతూనే ఉంది. ప్రశాంత్ కిషోర్ ను రంగంలోకి దింపి నివేదికలు తయారు చేయించుకొని ఆ నివేదికలోని అంశాలవారీగా ఒక్కొక్క వ్యవహారాన్ని చక్కబెట్టుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఇందులో భాగంగానే ప్రజలతో ఎప్పుడు మమేకమయ్యేలా పనులు పథకాలను ముందుకు తీసుకువస్తున్నారు. ప్రధానంగా బీసీ కుల వృత్తులకు రుణాలు, మైనారిటీ వర్గాలకు మిషిన్లు, రుణాలు అంటూ కొత్త పథకాలను ప్రవేశపెట్టారు. అలాగే బీసీ విద్యార్థులకు విదేశాల్లో ఉచితంగా చదువుకునే అవకాశం అంటూ ఆయా శాఖల మంత్రులతో ప్రచారం చేయిస్తున్నారు. ఇదంతా ప్రశాంత్ కిషోర్ పథకంలోని భాగాలేనని వీటిని నమ్మి మోసపోకూడదని ప్రతిపక్షాలు ప్రజలను చైతన్యవంతం చేస్తున్నాయి. తాజాగా మరోసారి సోషల్ మీడియా పెద్ద బాంబుని పేల్చాయి. విషయం ఏంటంటే పెద్దపల్లి నియోజకవర్గం నుండి సీఎం కేసీఆర్, రామగుండం నుండి ఎమ్మెల్సీ కవిత పోటీ చేస్తారని ప్రచారం జోరుగా సాగుతున్నది. అయితే ప్రజల నాడిని పసిగట్టిన కేసీఆర్ తొమ్మిదేళ్లు అప్రతీహతంగా తన పాలనను సాగించినా కూడా గెలుపు ముంగిట బొక్క బోర్ల పడే ప్రమాదం ఉందని అంతర్మదనంలో పడిపోయారు. ఇక పెద్దపెల్లి, రామగుండం మంథని నియోజక వర్గాల్లో టిఆర్ఎస్ బలం రోజురోజుకు తగ్గుతుందని చెప్పవచ్చు. దీంతో రంగంలోకి దిగిన టిఆర్ఎస్ అధినేత తనదైన శైలిలో సోషల్ మీడియాకు లీకులు ఇచ్చినట్టుగా ప్రచారం సాగుతున్నది. దీన్ని కూడా ప్రతిపక్షాలు తమకు సానుకూలంగా మార్చుకుంటున్నాయి. ఎలాగంటే గతంలో పోటీ చేసిన నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని కాబట్టి అక్కడ గెలవని పరిస్థితులు ఉన్నాయని అందుకే అక్కడ కాకుండా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పోటీకి సిద్ధమవుతున్నట్లు ప్రచారం చేస్తున్నారు. అయితే బిజెపి మాజీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ పెద్దపల్లి నుండి ఎమ్మెల్యేగా పోటీ చేస్తారని జోరుగా ప్రచార సాగింది. కానీ బండి సంజయ్ ను రాష్ట్ర అధ్యక్ష పదవి నుండి తప్పించడం అంతా చకచక జరిగిపోయింది. చాలామంది కూడా ఇది బిఆర్ఎస్ తో కలిసిపోయిన కారణంగానే బండిని తప్పించారని, సోషల్ మీడియాలో గ్లోబల్ ప్రచారం సాగిస్తున్నారు. ఏది ఏమైనా ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో జరిగే శాసనసభ ఎన్నికలు అన్ని రాజకీయ పార్టీల నాయకులకు జీవన్మరణ సమస్యగా మారింది. గెలిచి హ్యాట్రిక్ సీఎంగా కొనసాగాలని బిఆర్ ఎస్ అధినేత, బిజెపి కాంగ్రెస్ పార్టీలు అధికారం కైవసం చేసుకోవడానికి తమ ప్రయత్నాల్లో ఉండగా మిగతా చిన్నాచితక పార్టీలు తమ బలాబలాలను ప్రదర్శించుకుంటూ ముందుకు సాగుతున్నారు.




# హైదరాబాద్ లో కేటీఆర్ పర్యటన

**జయభేరి, హైదరాబాద్ :**

రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలతో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పురపాలక శాఖ మంత్రి కే తారక రామారావు సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలను గౌరవ ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని.. పురపాలక శాఖ అధికారులతోనూ కూడా ముఖ్యమంత్రి ప్రత్యేకంగా మాట్లాడారని తెలిపారు. ల హైదరాబాద్ నగరంలోనూ జిహెచ్ఎంసి కమిషనర్ మరియు ఇతర ఉన్నతాధికారులు... క్షేత్రస్థాయిలో ఉన్న కిందిస్థాయి సిబ్బంది వరకు అందరూ పనిచేస్తున్నారు. పురపాలక ఉద్యోగుల అన్ని సెలవులను రద్దు చేయడం జరిగింది. పరిస్థితిని ఎప్పటికప్పుడు ఫోన్ల ద్వారా ఇతర మాధ్యమాల ద్వారా సమీక్షిస్తున్నామన్నారు. కుంభవృష్టిగా వర్షం పడడం ఎడతెరిపి లేకుండా వర్షం కురవడం వలన ప్రజలకు కొంత ఇబ్బంది ఎదురవుతున్నదని తెలిపారు. ఇప్పటిదాకా ఎలాంటి ప్రాణా నష్టం జరగకుండా సాధ్యమైననిఎక్కువ జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందని తెలిపారు.



ప్రధాన లక్ష్యం ప్రాణ నష్టం జరగకుండా చూడడమేనని.. హైదరాబాద్‌కు రెడ్ అలర్ట్ ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం అన్ని రకాల ప్రయత్నాలు చేస్తుందన్నారు. హైదరాబాద్ నగరంలో డిసిల్టింగ్ కార్యక్రమాన్ని ఎప్పుడో పూర్తి చేశామని.. దీంతోపాటు చెరువుల బలోపేతం చేసే కార్యక్రమాలు కూడా చేపట్టాము. 135 చెరువులకు గేట్లు బిగించామన్నారు. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ అధికారులు సిబ్బంది కూడా విస్తృతంగా పనిచేస్తున్నారని స్పష్టం చేశారు. గతంలో ఇలాంటి భారీ వర్షాలు పడితే అనేక ప్రాంతాలు జలమయం అయ్యేది. అయితే ఈసారి నాలా డెవలప్మెంట్ ప్రోగ్రాం ద్వారా చేపట్టిన కార్యక్రమాల వలన వరద ప్రభావం కొంత తగ్గిందని సంతృప్తి వ్యక్తం చేశారు. గత సంవత్సరంతో పోల్చుకుంటే ఆయా ప్రాంతాల్లో వరద సమస్య బాగా తగ్గింది .. ప్రభుత్వము, ప్రభుత్వ యంత్రాంగం పూర్తి సిబ్బంది 24 గంటలు ఈ భారీ వర్షాలను ఎదుర్కొనేందుకు పనిచేస్తుందన్నారు. ప్రతిపక్ష పార్టీలు రాజకీయాలు మాని... భారీ వర్షాల వల్ల ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని సూచించారు. భారీ వర్షాల్లో నిరంతరం పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల మనోధైర్యం దెబ్బతీసే విధంగా చిల్లర విమర్శలు చేయవద్దన్నారు. ప్రభుత్వంలోని అన్ని శాఖలు వర్షాన్ని ఎదుర్కొనేందుకు పనిచేస్తున్నాయి వారి మనో ధైర్యం దెబ్బతినకుండా నాయకులు మాట్లాడితే బాగుంటుందని సలహా ఇచ్చారు. వరద పెరిగే ప్రాంతాల్లో ఉన్న పౌరులను అలర్ట్ చేస్తున్నామని.. ఎక్కడికక్కడ కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేస్తూ తాత్కాలిక షెల్టర్లను ఏర్పాటు చేస్తున్నామని కేటీఆర్ తెలిపారు. చెరువులకు గండి పడే ప్రమాదం ఉంటే వాటిని కూడా సమీక్షిస్తున్నామన్నారు. వరంగల్ నగరానికి వెళ్లాలని మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించాము. అవసరమైతే రేపు నేను కూడా స్వయంగా వెళ్తానన్నారు. హైదరాబాద్ నగరంలోనూ పలు ప్రాంతాల్లో కేటీఆర్ పర్యటించారు. హుస్సేన్ సాగర్ వద్ద వరద ఉధృతిని పరిశీలించారు. ల ప్రాణ నష్టం జరగకుండా చూడడమే ప్రాథమిక ప్రాధాన్యతగా పని చేయాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న పరిస్థితులపైన అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. శిథిల భవనాల నుంచి జనాలను వెంటనే తరలించాలన్నారు.



# హుస్సేన్ సాగర్‌లో వరద

**జయభేరి, హైదరాబాద్ :**

హైదరాబాద్‌లో వారం రోజులుగా ఎడతెరపిలేకుండా వానలు కురుస్తున్నాయని, దీంతో హుస్సేన్ సాగర్‌కు భారీగా వరద వచ్చి చేరుతున్నదని మంత్రి కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలోని అన్ని పట్టణాల్లో ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్‌తో కలిసి హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్‌లో వరద పరిస్థితిని మంత్రి కేటీఆర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. వర్షకాలం ప్రారంభానికి ముందే నాలాల్లో పూడిక తీశామని చెప్పారు. చెరువుల్లోనూ తక్కువ నీటిమట్టం ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నామని వెల్లడించారు. నగరంలో ఎస్సార్‌డీపీ చేపట్టకముందు లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యేవని చెప్పారు. విపత్కర పరిస్థితుల్లో చేతనైతే ప్రతిపక్షాలు సహాయక చర్యల్లో పాల్గొనాలని మంత్రి కేటీఆర్ సూచించారు. వర్షాలను కూడా రాజకీయం చేయడం సరికాదన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో రిలీఫ్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ప్రాణనష్టం జరుగకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో 14 బ్రిడ్జిలు మంజూరు చేశామన్నారు. అనంతరం ముసారంబాగ్ వద్ద మూసీనదిపై ఉన్న బ్రిడ్జిని మంత్రి కేటీఆర్ పరిశీలించారు. భారీ వర్షాల నేపథ్యంలో హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో పురపాలక శాఖ మంత్రి @KTRBRS పర్యటించారు. హుస్సేన్ సాగర్ వద్ద వరద ఉధృతిని మంత్రి పరిశీలించారు. అనంతరం చాదర్ ఘాట్ మూసీ నది లోలెవెల్ వంతెన వద్ద వరదను పరిశీలించారు.

# నారాయణపేట జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

**లారీని వెనుక భాగంలో ఢీ కొట్టి ఇరుక్కుపోయిన కారు.. ఇద్దరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు.. మృతులు ఆంధ్రప్రదేశ్ పల్నాడు జిల్లా వాసులు**



**జయభేరి, మక్తల్ :**

నారాయణపేట జిల్లా మక్తల్ మండలం గుడిగండ్ల గ్రామ శివారులో గురువారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందగా, మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. వివరాలలోకి వెళితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలానికి చెందిన భాష (50), షికూర్ (50), వెంకట్రావు స్నేహితులు. మీరు ముగ్గురు కలిసి కారులో గోవా వెళ్లారు. విహారయాత్రను ముగించుకొని తిరిగి వస్తుండగా మక్తల్ మండలం, గుడిగండ్ల గ్రామ సమీపంలో హైదరాబాద్ వైపు వెళుతున్న లారీని ఓవర్టేక్ చేయబోయి వెనుక భాగంలో ఢీ కొట్టి లారీ వెనుక భాగంలో ఇరుక్కుపోయింది. ఈ విషయము గమనించని లారీ డ్రైవర్ లారీని యధావిధిగా తీసుకువెళ్లాడు. అర కిలోమీటర్లు పైగా ప్రమాదానికి గురైన కారుతో పాటు లారీ వెళుతుండడం చూసిన కొంతమంది లారీని ఓవర్టేక్ చేసి విషయాన్ని డ్రైవర్ కు చెప్పారు. లారీని పక్కకు ఆపి ప్రమాదం జరిగిన విషయాన్ని గుర్తించిన లారీ డ్రైవర్ భయంతో పరారు అయ్యాడు. విషయం పోలీసులకు తెలియడంతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని గుర్తించారు. భాష, షుఖుర్ అప్పటికే మృతి చెంది ఉండగా, వెంకట్రావు తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు గుర్తించారు. డ్రైవర్ ప్రశాంత్ కు సీటు బెల్టు ఉండడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. తీవ్రంగా గాయపడిన వెంకట్రావును మహబూబ్ నగర్ జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు మక్తల్ ఎస్సై పర్వతాలు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



# జలపాతాల వద్ద చుక్కా ముక్కా బంద్

**జయభేరి, వరంగల్ :**

మందుబాబులు బీకేర్ ఫుల్.. అక్కడ ప్రకృతి అందాలను చూసి మై మరిచి మందు తాగితే రంగు పడుద్ది.. ఆ అడవిలో మందుతాగితే జరిమానా... జేబు కాళీ వెహికిల్ సీజ్ అటవీశాఖ హెచ్చరిక బోర్డులు అడవుల్లో జలపాతాల వద్ద ఎంజాయ్ చేయడం కోసం వెళ్ళే వారికి చుక్కాముక్కా కామన్.. మరీ ముఖ్యంగా బొగత జలపాతాల సందర్శనకు కుటుంబ సమేతంగా వెళ్ళేవారు తనివితీరా ఎంజాయ్ చేస్తుంటారు.. ఫ్రెండ్స్ తో వెళ్ళినా, ఫ్యామిలీ మెంబెర్స్ వెళ్ళినా ఈ అడవిలో ఓ చుక్కవేస్తేనే కిక్కు.. కానీ ఇప్పుడు సీన్ మారింది.. బొగత జలపాతాల వద్ద మద్యం సేవిస్తే జరిమానా తప్పదు... జేబు కాళీ చేసుకోవాల్సిందే... ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి ప్రాంతంలోని బొగత జలపాతాల వద్ద అటవీ శాఖ కఠిన నిబధనలకు శ్రీకారం చుట్టింది.. పర్యాటకులు మద్యం సేవించడం పై నిషేదం విధించారు.. వాహనాల్లో మద్యం బాటిల్స్ కలిగి వుంటే ఆ వాహనం సీజ్ చేస్తారు.. బొగత జలపాతం పరిసరాల్లో ఎక్కడ మద్యం సేవించినా రూ. 2000 రూపాయల జరిమానా... కఠిన నిబంధనలు అమలు చేస్తున్నారు.. అటవీశాఖ వాజేడు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో భోగత జలపాతాల వద్ద హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేశారు.. గీత దాటితే వేటు తప్పదని సూచిస్తున్నారు.. తెలంగాణ నయాగార గా పేరుగాంచిన బొగత జలపాతం వద్దకు ప్రతినిత్యం వందల మంది పర్యాటకులు రాకపోకలు సాగిస్తుంటారు. బొగత జలపాతం ప్రకృతి రమణీయ దృశ్యాలను, జాలువారే నీటిని తిలకించేందుకు సుదూర ప్రాంతాల నుండి పర్యటకులు రాకపోకలు సాగిస్తుంటారు. కొంతమంది యువకులు మద్యం సేవించి, మద్యం బాటిల్స్ హల్ చల్ చేస్తున్నారు.. తనిఖీలు చేస్తున్న సమయంలో అధికారుల కళ్ళు గప్పి బ్యాగులలో మద్యం తీసుకు వెళ్తుంటారు. మద్యం మత్తులో స్నానాలకు వెళ్లి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఇప్పటివరకు స్నానాలకు వెళ్లి మృతి చెందిన సంఘటనలుఅనేకం ఉన్నాయి. పర్యాటకుల భద్రత కోసం వారి రక్షణ కోసం అటవీశాఖ ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసారు. తెలంగాణ నయాగారగ పేరుగాంచిన జలపాతం వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుతో పాటు నిఘా తీవ్రతరం చేశారు.అలాగే అనుమతి లేకుండా జలపాతాల వద్దకు వెళ్ళ వద్దని పర్యాటకులకు ఫారెస్టు అదికారులు సూచించారు.



# జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు

**జయభేరి, జగిత్యాల :**

జిల్లాలో కురుస్తున్న వర్షాల వలన ప్రాణ నష్టం వాటిల్లకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం రోజున తన క్యాంపు కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ యాస్మిన్ బాషా. జిల్లా, మండల అధికారులు, పోలీసు అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వాతావరణ శాఖ జిల్లాను రెడ్ అలర్ట్ గా ప్రకటించిందని, రానున్న 24 గంటలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వర్షాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా అధికార యంత్రాంగం ముందస్తు ప్రణాళికలతో సమన్వయంతో ఉండి, లోతట్టు, నీటి పరివాహక ప్రాంతాలలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అన్నారు. జిల్లాలో 6 మండలాల్లోని 30 గ్రామాలు గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఉన్నందున, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తివేయడం ద్వారా నీటి ప్రవాహం వలన సమస్యలు రావడం జరుగుతాయని, ఆ గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని అన్నారు. ప్రతీ మండలంలో సహాయ పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఆయా కేంద్రాలలో భోజనం, త్రాగు నీరు, బ్లాంకెట్లు, మందులు, వైద్య సిబ్బంది, తదితర ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఇప్పటికే 90 గ్రహాలలోని 296 మందిని సహాయ పునరావాస కేంద్రాలకు తరలించడం జరిగిందని తెలిపారు. తక్కువ ఎత్తు గల బ్రిడ్జి లపై నుండి ప్రవహించే ప్రాంతాల్లో రవాణా ఆపివేసి, బారి కెడ్స్ ఇరువైపుల ఏర్పాటు చేయాలని, ట్రాక్టర్లను అడ్డుగా కోట దూరం లో పెట్టలనీ సూచించారు. జిల్లాలోని చెరువుల్లో నీటి పరిమాణం లను గుర్తించి ప్రమాద స్థాయిలో ఉన్న చెరువు ప్రాంతాలలో ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. జిల్లాలో 1064 చెరువులకు గాను, ఇప్పటి వరకు 877 చెరువులు సర్ ప్లస్ నీరు చేరిందని తెలిపారు. వసతి గృహాల్లోనీ పిల్లలకు సౌకర్యాలు అందించాలని అన్నారు. గ్రామాల్లో పిల్లలు నీటి పరివాహక ప్రాంతాలలో సెల్ఫీ లు తీసుకోవడం జరుగుతున్నదని, వర్షాల వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, సేల్ఫీ లు తీసుకోకుండా నిరోధించాలని సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండే విధంగా టామ్ టామ్ నిరంతరంగా నిర్వహించాలని పంచాయతీ, మునిసిపల్ అధికారులను ఆదేశించారు. ఆర్డీఓ లు వారి పరిధిలో పర్యటించి వరద పరిస్థితులు, సహాయ పునరావాస కార్యక్రమాలను పర్యవేక్షించాలని అన్నారు. ఎస్పీ భాస్కర్ మాట్లాడుతూ, రానున్న 24 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అలాగే ఎస్సారెస్పీ ప్రాజెక్టు గేట్లు ఎత్తి వేసే అవకాశం ఉన్నందున గోదావరి పరివాహక ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు. రాత్రి వేళల్లో నీటి ఉధృతి పెరగడం జరుగుచున్నది, రాత్రి వేళల్లో విధులు నిర్వహించేందుకు టార్చ్ లైటు, తాడు, జాకెట్, ఈతగాళ్లు లను అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 75 ప్రాంతాలలో స్ట్రీమ్స్ తెగిపోయాయని, ఆయా ప్రాంతాల్లో వాహనాలు, ప్రజలు తిరుగకుండా బారికెడ్స్ ఏర్పాటు చేసి, పోలీసులు గస్తీ ఏర్పాటు చేయడం జరిగాయని తెలిపారు.ఆనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర్ మాట్లాడుతూ, ఎట్లాంటి సంఘటనలు జరుగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయడం, ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు. సెల్ఫి తీసుకోకుండా నిరోధించాలని, చేపల వేటకు వెళ్లే వాళ్ళను ఆపివేయాలని, సహాయ పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేసి, సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఆనంతరం అదనపు కలెక్టర్ బి.ఎస్. లత మాట్లాడుతూ, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయ పనులకు ఎవరు కూడా వెళ్లకుండా గ్రామాలలో టామ్ టామ్ చేయాలని అన్నారు. ఈ జూమ్ కాన్ఫరెన్స్ లో ఆర్డీవోలు , జిల్లా, మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## నేతన్నలతో మాట్లాడనున్న ప్రధాని

**జయభేరి, గుంటూరు :**

ఆంధ్రప్రదేశ్‌లో చేనేత రంగానికి పెట్టింది పేరు మంగళగిరి పట్టణం. ఇక్కడ తయారయ్యే చీరలకు జాతీయ స్థాయిలో ఎంతో గుర్తింపు ఉంది. తాజాగా మంగళగిరి చేనేతకు మరో అరుదైన గౌరవం దక్కింది. చేనేతకు జిఐ గుర్తింపు లభించింది. ఆగస్టు 7 చేనేత దినోత్సవం. చేనేత దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ నేతన్నలతో వర్చువల్‌గా మాట్లాడనున్నారు. ఇందుకోసం దేశంలోని 75 మంది చేనేత కార్మికులు, ఉత్పత్తిదారులను ఎంపిక చేశారు.ఇందుకోసం కేంద్ర జౌళి శాఖ ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాలు దేశ వ్యాప్తంగా పర్యటించాయి. ఒక బృందం మంగళగిరిలో చేనేత కార్మికులు కోసం నిర్మిస్తున్న మగ్గం షెడ్లు, చేనేత భవన సముదాయాన్ని పరిశీలించింది. దీంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు అందిస్తున్న చేనేత నేస్తం పథకంపై కూడా ఆరా తీసింది. ఇక్కడ నుండి వెళ్ళిన తర్వాత మంగళగిరిలో ఇంకా చేనేత కార్మికులు పెద్ద సంఖ్యలో ఉండటం, చేనేతను కాపాడుకునే ప్రయత్నం చేస్తుండటంతో మంగళగిరి నేతన్నను ప్రధాని మాట్లాడేందుకు ఎంపిక చేసింది. ఈ విషయాన్ని కేంద్ర జౌళి శాఖాధికారులు స్థానిక ఎమ్మెల్యేకు సమాచారం ఇచ్చారు. వచ్చే నెల ఏడో తేదీన ప్రధానితో వర్చువల్‌గా మాట్లాడేందుకు మగ్గం షెడ్ల ప్రాంగణాన్ని సిద్దం చేయాలని ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. అదే విధంగా ప్రధాని మాట్లాడనున్న వారిని కూడా ఎంపిక చేసి వారి పేరు కేంద్రానికి పంపాలని ఎమ్మెల్యే సూచించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో మంగళగిరి దక్కిన అరుదైన అవకాశంగా దీనిని భావిస్తున్నామని ఎమ్మెల్యే ఆర్కే చెప్పారు. ఈ ప్రాంతం చేనేత కార్మికుడికి దక్కిన గుర్తింపుగా భావిస్తున్నామన్నారు.

## నంద్యాల జిల్లాలో నల్లమల ప్రకృతి సోయగాలు

**జయభేరి, కర్నూలు :**

నంద్యాల జిల్లాలోని నల్లమల అడవుల్లో అద్భుతమైన అందాలను వెదజల్లుతున్న జలపాతం చూసేందుకు రెండు కళ్ళు చాలడం లేదు. నిన్నటి వరకు వర్షాలు లేని జిల్లాలో ఒక్కసారిగా జలపాతం ఆవిష్కృతం అయ్యిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. నయాగరా వాటర్ ఫాల్స్, బాహుబలి గ్రాఫిక్స్ వాటర్ ఫాల్స్ ను మించి నల్లమల వాటర్ ఫాల్స్ ప్రకృతి.. ప్రకృతి సోయగాల మధ్య పచ్చటి నల్లమల అడవి అందాల మధ్య తెల్లని పాలవలే మంచు పొగతో కూడిన నీటి సోయగాల అందాలను చూడడానికి రెండు కళ్ళు చాలవు అంటే అతిశయోక్తి లేదు. ఇంతకు ఈ వాటర్ ఫాల్స్ ఎక్కడున్నాయనే కదా.. ఉమ్మడి కర్నూలు జిల్లా లోని ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని ఇందిరేశ్వరం గ్రామ సమీపంలోని గుమితం ఆలయం దగ్గర గల నల్లమల వాటర్ ఫాల్స్ పర్యాటకులను ఆకర్షిస్తుంది. బాహుబలి అందాలకు ఏమాత్రం తీసిపోకుండా కళ్ళను పక్కకు తిప్పుకోకుండా ఎత్తైన కొండపై నుంచి నీళ్లు జారి పడుతూ ఉంటే ఆ సుందర దృశ్యం వర్ణణీతం. నల్లమల్ల అడవిలో ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు కాలువలు గుండా వయలు పోతూ పెద్ద ఎత్తైన కొండపై నుంచి నీళ్లు కిందికి శబ్దం చేసుకుంటా దూకుతూ ఉంటే నీళ్ల శబ్దం కు పక్షుల కిలకిల రావాలకు ఆ దృశ్యం అద్భుతం మహాద్భుతం.అయితే ఇంతటి అద్భుత దృశ్యాలను చూడడానికి పర్యాటకులు భారీగా వెళ్లడానికి ఆసక్తి చూపుతున్న ఫారెస్ట్ అధికారుల అనుమతి లేకపోవడంతో ఎవరు వెళ్లలేక పోతున్నారు.ప్రస్తుతం నల్లమల అడవిలో మూడు నెలల పాటు పర్యాటకుల నిషేధం ఉండడం వాటర్ ఫాల్ ఉన్న ప్రదేశం టైగర్ రిజర్వ్ జోన్ కావడంతో ఇప్పుడు ఈ మూడు నెలల సమయం పెద్దపులుల సంభోగ సమయం కావడంతో జులై నుంచి సెప్టెంబర్ వరకు మూడు నెలలు నల్లమల అడవిలోకి సందర్శనా స్థలాలు యాత్ర స్థలాలు కు వెళ్లే యాత్రికులను భక్తులను ఫారెస్ట్ అధికారులు అనునతించడం లేదు. దీంతో ఈ సుందర దృశ్యాలను చూసే అవకాశం కోల్పోతున్నారు. ఈ సంభోగ సమయంలో పెద్దపురులకు శబ్ద కాలుష్యం జరిగితే అబార్షన్ అయ్యే అవకాశం ఉంది అనేది అటవీశాఖ అధికారుల అభిప్రాయం.

## రెడ్ బుక్ లో ఏముంది...

**జయభేరి, ఒంగోలు :**

ఆంధ్రప్రదేశ్‌లో భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రస్తుతం యువగళం పాదయాత్ర చేస్తున్నారు. తన ప్రయాణ సమయంలో లోకేష్ రెడ్ కవర్‌తో కూడిన బుక్‌ని తీసుకువెళుతుండటం చూపరులలో ఉత్సుకతను రేకెత్తించింది. తాజాగా రెడ్ బుక్‌లోని విషయాలు, ఆ బుక్‌ని వెంట తీసుకెళ్లడానికి గల ఉద్దేశ్యాన్ని లోకేష్ ఎట్టకేలకు వెల్లడించారు. తన పాదయాత్రను అడ్డుకోవడం ద్వారా ఏపీ సీఎం వైఎస్ జగన్‌పై అభిమానం పెంచుకోవాలని కొందరు అధికారులు విపరీతంగా ఆరాటపడుతున్నారని లోకేష్ అన్నారు. ఈ అధికారులు నిబంధనలను ఉల్లంఘించి చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నారని, దీంతో టీడీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టారని ఆరోపించారు. ఈ అధికారులను జవాబుదారీగా ఉంచేందుకు, బాధ్యుల పేర్లను రెడ్ బుక్‌లో నమోదు చేస్తున్నట్లు లోకేష్ వెల్లడించారు. సీఎం జగన్‌కు కులం, మతం, డబ్బు తప్ప ప్రజా సంక్షేమం పట్టదన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే వైసీపీ (యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ) ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరించిన అధికారులపై సమగ్ర విచారణ చేపడతామని లోకేశ్ స్పష్టం చేశారు. బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక జ్యుడీషియల్ విచారణ చేయించి బాధ్యులను తప్పక శిక్షిస్తామన్నారు.తన దృఢ సంకల్పాన్ని ప్రదర్శించేందుకు, ప్రకాశం జిల్లా చీమకుర్తిలో లోకేశ్ రెడ్ బుక్‌ను ప్రజలకు, మీడియాకు బహిరంగంగా ప్రదర్శించారు.రెడ్ బుక్ బయటపెట్టడంపై వైసీపీ స్పందిస్తూ లోకేష్ పై విమర్శలు, హేళనలు చేస్తోంది. ఈ పుస్తకంలో ఇప్పటి వరకు ఎన్ని పేర్లు రాశారని, ఈ అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారని వారు ప్రశ్నించారు. అంతేకాకుండా భవిష్యత్తులో టీడీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉందా? అని ప్రశ్నిస్తున్నారు. అయితే ఆరోపించిన ఉల్లంఘనలను పరిష్కరించాలని, వారి అధికారాన్ని దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని లోకేష్ నిశ్చయించుకున్నారు.

## సహాయక చర్యల్లో హెలికాప్టర్లు

**జయభేరి, భూపాలపల్లి :**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మోరంచపల్లి గ్రామస్తులు అందరూ సురక్షితంగా బయటపడ్డారు. వరదల్లో చిక్కుకున్న ఆరుగురిని హెలికాప్టర్ ద్వారా సిబ్బంది రెస్క్యూ చేసారు. రెండు హెలికాప్టర్లు, బోట్ల ద్వారా గ్రామస్తులను రక్షించారు. సహాయక చర్యల్లో రెండు హెలికాప్టర్లు పాల్గొన్నాయి. ఆరు ఫైర్ డిపార్ట్మెంట్ బోట్లతో గ్రామస్థులను రక్షించారు. గ్రామం మొత్తాన్ని ఖాళీ చేయించారు.

## ఖమ్మంకు తరలిన ఎన్డీఆర్ఎఫ్

**జయభేరి, ఖమ్మం :**

ఖమ్మంలో మున్నేరు వరదలో చిక్కుకున్న ఏడుగురి కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందం రంగంలోకి దిగింది. మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కు సీఎం కేసీఆర్ ఫోన్ చేసారు. మున్నేరు వరద ఉధృతి , సహాయ చర్యల పై మంత్రి పువ్వాడని అడిగి తెలుసుకున్నారు. వరద ప్రవాహంలో ఓ ఇంట్లో చిక్కుకున్న ఏడుగురి నీ రక్షించేందుకు ఎన్డిఆర్ఎఫ్ బృందాన్ని హుటాహుటిన ఖమ్మం తరలించాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. సీఎం కేసీఆర్ ఆదేశాలతో మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ భద్రాచలం నుంచి ఖమ్మం బయలుదేరారు. విశాఖ నుంచి భద్రాచలం వస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాన్ని మార్గమధ్యంలో ఖమ్మం మళ్లించాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. ప్రత్యేక డ్రోన్ పంపించి ఇంట్లో చిక్కుకున్న ఏడుగురి పరిస్థితి నీ ఆరా తీస్తున్నారు.

# సారీ.. సార్ విలువ తగ్గిపోతోంది

**జయభేరి, కాకినాడ :**

కాకినాడ జిల్లా రామచంద్రాపురం రాజకీయం ఏపీలో రసకందాయంగా మారిన సంగతి అందరికీ తెలిసిందే.. అధికార పార్టీలో వర్గపోరు ఊహించని స్థాయికి చేరుకొన్న తరువాత మంత్రి వేణుగోపాల కృష్ణ, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్‌ల మధ్య వ్యవహారం తెగేదాకా పోయింది. తమకు ఇద్దరు కూడా ముఖ్యమేనని ముఖ్యమంత్రి జగన్ సహా వైసీపీ అధిష్టానం చెప్తున్నప్పటికీ పిల్లి సుభాష్ బోస్ మాత్రం బెట్టువీడలేదు.. అయితే, బోస్ వ్యవహారంపై వైసీపీ అధిష్టానం మరోమారు దృష్టిపెట్టింది. దీనిలో భాగంగా సీఎం జగన్.. బోస్‌ను పిలిపించి మాట్లాడారు.. చర్చల అనంతరం రామచంద్రాపురం అభ్యర్థి ఎవరో సీఎం జగన్ నిర్ణయిస్తారన్న పిల్లి.. ఎంపీగా తాను రాజీనామా చేస్తానన్నందుకు.. సీఎంకు క్షమాపణ చెబుతున్నానంటూ బోస్ చెప్పారు.వైయస్సార్ సీఎంగా ఉన్నప్పుడు పిల్లి సుభాష్ బోస్ మంత్రిగా ఉన్నారు. వైయస్. జగన్‌ను ముఖ్యమంత్రిగా నియమించకపోవడంతో ఆయన మంత్రిపదవిని వదులుకుని అప్పట్లో జగన్ తరఫున నిలబడ్డారు. ఉమ్మడి రాష్ట్ర రాజకీయాల్లో ఇలా నిలబడ్డవారు ముగ్గురు మాత్రమే. ఒకరు బోస్, ఇంకొకరు బాలినేని, మరొకరు కొండాసురేఖ. బోస్‌పట్ల సీఎం జగన్‌కున్న కృతజ్ఞతకూడా అదే. 2012 ఉప ఎన్నికల్లో బోస్ పోటీచేసినా.. అప్పట్లో కాంగ్రెస్ నుంచి పోటీచేసిన తోటత్రిమూర్తులు చేతిలో ఓడిపోయారు. తర్వాత 2014 ఎన్నికల్లోనూ టీడీపీ నుంచి పోటీచేసిన తోట త్రిమూర్తులు చేతిలో బోస్ ఓడిపోయారు. కాని అప్పటికే ఆయన వైయస్సార్‌సీపీ ఎమ్మెల్సీగా ఉన్నారు. బీసీ సామాజిక వర్గం కావడం, కష్టకాలంలో జగన్ తరఫున నిలబడ్డంతో మిగిలిన వారితో పోలిస్తే బోస్ బాగానే పదవులు వచ్చాయి. 2019 ఎన్నికల్లో పోటీచేయకపోయినా, ఎమ్మెల్సీగా ఉన్న బోస్‌కు సీఎం మంత్రి పదవి ఇచ్చారు. ఆతర్వాత అనూహ్యంగా రాజ్యసభకు కూడా ఆయన్ని పంపారు. బోస్ రాజకీయ జీవితంలో ఇది పెద్దస్థానం. ఇదే సమయంలో సీఎం జగన్ తనను నమ్ముకున్న వేణుగోపాలకృష్ణను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నంచేస్తున్నారు. వైయస్సార్ ఉన్నప్పుడు జడ్పీ ఛైర్మన్‌గా వేణు పనిచేశారు. ఆతర్వాత జగన్ వెంట నడిచారు. 2014 ఎన్నికల్లో కాకినాడ రూరల్‌నుంచి పోటీచేసి ఓడిపోయారు. తర్వాత 2019లో రామచంద్రాపురం టిక్కెట్‌ను వైసీపీ వేణుకు ఇచ్చింది. వేణుకూడా బలమైన బీసీ సామాజిక వర్గం శెట్టిబలిజకు చెందినవారే. బోస్‌కూడా ఇదే కులానికి చెందినవారు. బోస్ రాజ్యసభకు వెళ్లిన తర్వాత ఆ పదవిని మంత్రి పదవిని వేణుకు ఇచ్చారు సీఎం. మంత్రివర్గం మొత్తాన్ని మార్చినా కొనసాగించిన కొద్దిమందిలో వేణు ఒకరు. తనకు సమాంతరంగా వేణు ఎదగడంతో బోస్ వర్గానికి రాజకీయంగా ఇబ్బందిగా తయారయ్యింది. మరోవైపు తన కుమారుడు రాజకీయ జీవితంపై కూడా ఇది ప్రభావం చూపుతుందని బోస్ కొన్నిరోజులుగా స్వరం మార్చుకుంటూ వస్తున్నారు.2019 ఎన్నికల తర్వాత రామచంద్రాపురంలో మరొక పరిణామం ఏంటంటే... అప్పట్లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసిన కాపు సామాజిక వర్గానికి చెందిన బలమైన వ్యక్తి తోట త్రిమూర్తులు వైసీపీలో చేరారు. ఆయన్నికూడా సీఎం బాగానే బలపరుస్తున్నారు. వెంటనే ఎమ్మెల్సీకూడా ఇచ్చారు. అంతేకాదు పక్కనే ఉన్న మండపేట నియోజకవర్గాన్ని ఆయనకు అప్పగించారు. గడపగడపకూ సహా అనేక కార్యక్రమాల్లో త్రిమూర్తులు జోరుగా తిరుగుతున్నారు. త్రిమూర్తులను రామచంద్రాపురం నుంచి మండపేటకు పంపడం, వేణుకు మళ్లీ టికెట్ క్లియర్ చేయడంలో భాగమేనని బోస్ వర్గం ఆదినుంచి అనుమానంతో ఉంది. టికెట్ వేణుకే అని స్వయంగా సీఎం చెప్పారంటూ వైసీపీ అధిష్టానం కూడా స్పష్టంచేయడంతో పిల్లబోస్ అగ్గిమీద గుగ్గిలం అయ్యారు.బోస్‌ను చల్లార్చేందుకు సీఎం సహా వైసీపీ పెద్దలు చాలా ప్రయత్నాలు చేసినప్పటికీ ప్రయత్నాలు ఫలించలేదు. నానాటికీ నియోజకవర్గంలో పట్టు తగ్గుడం, తాను ఢిల్లీకే పరిమితం కావడం బోస్‌కు ఇష్టంలేదు. తన కుమారుడికి రాజకీయ జీవితం ఇవ్వాలన్న తలంపులో గట్టిగా ఉన్నట్టు ఆయన అనుచరులే చెప్తున్నారు.



దీంట్లో భాగంగానే అవసరమైతే రాజ్యసభను వదులుకొంటానని అన్నారు. చివరకు వేణు బోస్‌ల మధ్య వివాదం తెగేదాకా వెళ్లింది. వేణుకు సీఎం జగన్ సహా, వైసీపీ అధిష్టానం టిక్కెట్ విషయంలో క్లారిటీ ఇచ్చేంది. ఇక తేల్చుకోవాల్సింది పిల్లి సుభాష్ చంద్రబోసే అని వైసీపీ పెద్దలు క్లారిటీ ఇచ్చారు. అయితే మళ్ళీ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ మిథున్ రెడ్డి బోస్ మీడియా తో రాజ్యసభ వదులు కొంటానని కామెంట్ చేసిన తరువాత పిలిచి మాట్లాడారు.. పిల్లి కొడుకు సూర్య ప్రకాష్ కూడా వచ్చారు. మరి పిల్లి సుభాష్ ను ఏమని చెప్పి శాంతించారు తెలియదు కానీ ప్రస్తుతానికి మాత్రం పిల్లి వెనక్కి తగ్గారు. "రామచంద్రాపురంలో ఎవరిని అభ్యర్థిగా నిలపాలో సీఎం నిర్ణయిస్తారు. తప్పకుండా మంచి నిర్ణయం తీసుకుంటానని సీఎం మాటిచ్చారు.. ఎంపీగా రాజీనామా చేసి ఇండిపెండెంట్ గా పోటీచేస్తానని గతంలో చెప్పాను.. అది బాధాకరమైన విషయం, సీఎంకు క్షమాపణలు చెబుతున్నా.. జనసేనలోకి నేను వెళ్తానన్న పుకార్లు నమ్మవద్దు".. అంటూ పిల్లి సుభాష్ చంద్రబోస్ ఈ ఎపిసోడ్ ను క్లోజ్ చేశారు..

# వాసుపల్లి వర్సెస్ సీతంరాజు...

**జయభేరి, విశాఖపట్టణం:**

వాసుపల్లి గణేష్ 2019లో విశాఖ సౌత్ నియోజకవర్గం నుంచి రెండోసారి వరుసగా ఎమ్మెల్యేగా తెలుగుదేశం పార్టీ నుంచి ఎన్నికయ్యారు. అనంతరం జగన్మోహన్ రెడ్డి అభివృద్ధి పనులు నచ్చాయంటూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలోకి మారిన వాసుపల్లి గణేష్ పై తాజాగా వెలసిన ఈ పోస్టర్లు ప్రస్తుతం విస్తృత చర్చకే తావిచ్చాయి. ఇది ప్రతిపక్షాల పని అయితే గణేష్ కేమీ బెంగ లేదట, కానీ ఇది సొంత పార్టీలోనే నేతల పనే అన్నది గణేష్ అనుమానం అట. అదే అతనిని తీవ్ర ఆగ్రహానికి గురి చేసిందట. ప్రతిపక్షాన్ని ఎదుర్కోవడానికి నేను సమర్థంగానే ఉన్నా సొంత పార్టీలో నేతలను ఎదుర్కోవడం ఇబ్బందిగా ఉందని వాపోతున్నారట గణేష్. వాస్తవానికి తెలుగుదేశం పార్టీతోనే రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన వాసుపల్లి గణేష్ రెండుసార్లు ఎమ్మెల్యేగా, తెలుగుదేశం పార్టీ విశాఖ నగర అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ లో పైలెట్ గా సేవలందించి పదవీ విరమణ అనంతరం డిఫెన్స్ అకాడమీ స్థాపించి, విద్యావేత్తగా కూడా రాణించి అనంతరం రాజకీయాల్లోకి వచ్చి బలమైన మత్స్యకార సామాజిక వర్గ నేతగా గుర్తింపు పొందారు. అయితే తెలుగుదేశం పార్టీలో గెలిచి వైసిపి లోకి ఆయన వచ్చిన తర్వాత స్థానికంగా ఉన్న వైసీపీ శ్రేణులతో ఆయనకి సఖ్యత కుదరలేదు. గణేష్ వైసిపిలో చేరే సమయానికి సరిగ్గా మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు జరుగుతూ ఉండడం ఆ సమయంలో అప్పటికే వైసిపి తమ కార్పొరేటర్ అభ్యర్థులని నిలబెట్టడం సరిగ్గా అదే సమయంలో పార్టీలో చేరిన నేపథ్యంలో టిడిపి నుంచి తనతోపాటు వచ్చిన ముఖ్య నేతలు కూడా కార్పొరేటర్లుగా బరిలో ఉండడంతో టికెట్లు పంపిణీ వ్యవహారం గందరగోళం అయింది. టిడిపి నుంచి గణేష్ తో వచ్చిన కొందరికి టికెట్లు దక్కినా వాళ్ళు ఓడిపోవడం, మొదటి నుంచి వైసీపీలో ఉన్న అభ్యర్థులు రెబల్స్ గా మారి ఇండిపెండెంట్ లుగా విజయం సాధించడంతో గణేష్ కి వారికి మధ్య అప్పటినుంచి వైరం నడుస్తూనే ఉంది. గణేష్ స్థానిక ఎమ్మెల్యే అయినా కార్పొరేటర్లు ఎవరూ ఆయన దగ్గరికి వెళ్లరు సరి కదా ఆయనకు వ్యతిరేకంగానే



ప్రెస్ మీట్ కూడా నిర్వహిస్తుంటారు. పార్టీ అధిష్టానం జోక్యంచేసుకొని తాత్కాలికంగా సర్ది చెప్పే ప్రయత్నం జరిగినా మళ్లీ అవే ఘటనలు పునరావృతం అవుతూ వస్తూనే ఉన్నాయిసరిగ్గా అదే సమయంలో వాసుపల్లి గణేష్ కి స్థానిక కార్పొరేటర్లకి మధ్య గ్యాప్ ఉండడం, గణేష్ ఇంకా కుదురుకొక పోవడం, గణేష్ మళ్లీ టీడీపీ లోకి వెళ్తారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలోనే ఎంట్రీ ఇచ్చాడు రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్ కుటుంబానికి సన్నిహిత నేతగా పేరు ఉన్న సీతంరాజు సుధాకర్. గణేష్ వైసీపీ లో చేరకముందే దక్షిణ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయాలన్న కోరిక బలంగా ఉన్న బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన సీతం రాజు సుధాకర్ అక్కడ పార్టీలో ఉన్న గ్రూప్ తగదాలని తనకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేశారట. విశాఖలో సౌత్ నియోజకవర్గం నుంచి గతంలో ద్రోణం రాజు సత్యనారాయణz ద్రోణం రాజు శ్రీనివాస్ లాంటి బ్రాహ్మణ నేతలు ఎమ్మెల్యేలుగా పనిచేసి ఉండడం, అక్కడ బ్రాహ్మణ సామాజిక వర్గ ఓట్లు కూడా అధికంగా ఉండడం తో అక్కడి నుంచి పోటీ చేయాలన్న కోరిక ఆయనకు బలంగా మొదటి నుంచే ఉందట. దీంతో గణేష్ పై అసంతృప్తితో ఉన్న కార్పొరేటర్ లని దగ్గరికి తీసుకొని వాళ్లతో నియోజకవర్గంలో రాజకీయం చేయడం ప్రారంభించాడట. అది గణేష్ కి ఇబ్బందిగా మారింది మొదట్లో పెద్దగా పట్టించుకోకపోయినా ఆ తర్వాత సుధాకర్ నియోజకవర్గంలో కీలక సమావేశాలు నిర్వహిస్తూ చొచ్చుకుపోయే ప్రయత్నం చేయడంతో అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాడు వాసుపల్లి. దీనిపై అనేకమార్లు పంచాయతీలు కూడా జరిగాయి.

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్ఆర్సిపి ఓటమి చెందడంతో మళ్లీ దక్షిణ నియోజకవర్గంపై దృష్టి సారించారు సీతం రాజు సుధాకర్. తాజాగా వెలిసిన ఈ పోస్టర్లు ప్రతిపక్షాల కంటే సొంత పార్టీలోని నేతల పనే అన్నది గణేష్ వాదనట. దీనికి సంబంధించి ప్రతిపక్ష నేతలని కూడా ఆయన ఆరా తీసారట. అక్కడ తెలుగుదేశం పార్టీ నుంచి గణేష్ వైసిపి లోకి రావడంతో టిడిపిలో నాయకత్వ సమస్య ఏర్పడింది. దాంతో గతంలో పెందుర్తి ఎమ్మెల్యేగా పనిచేసిన గండి బాబ్జిని నగరానికి తీసుకొచ్చి అక్కడ ఆయన్ని ఇన్చార్జిగా పెట్టి కార్యక్రమాలను చేస్తుంది టిడిపి. ఈ పోస్టర్లు అంటించిన పని మాది కాదని, వైసీపీలోని అంతర్గత విభేదాలే కారణమై ఉండొచ్చని టిడిపి ఇన్చార్జి గండి బాబ్జి చెప్తున్నాడట. అదే సమయంలో జనసేన కు కూడా ఆ నియోజకవర్గంలో బలమైన నేత ఎవరూ లేరు. వాళ్లు కూడా అలాంటి పోస్టర్లు అంటించే సాహసం చేసే నేత అక్కడ ఎవరు లేరని చెబుతున్నారట. దీంతో సొంత పార్టీలోని ఆధిపత్య రాజకీయ నేపథ్యంలోనే ఈ పోస్టర్లను అంటించారన్నది వాసుపల్లి వాదన. ఇప్పటికే నగర పోలీస్ కమిషనర్ కూడా ఫిర్యాదు చేశారట. పోస్టర్లు అంటించిన వారిని గుర్తించాలని కోరారట. ప్రాథమిక సమాచారాన్ని తీసుకొని ఇక అధిష్టానం వద్ద తాడోపేట తేల్చుకోవాలని వాసుపల్లి గణేష్ నిర్ణయించుకున్నాడట. ఎన్నికలు కూడా దగ్గర పడుతుండడంతో ఇంకా ఇలాంటి అడ్డంకులు, అంతర్గత సమస్యలు ఉంటే మళ్ళీ ఆ ప్రభావం ఎన్నికలపై పడుతుందని, ఇప్పటికైనా స్పష్టత ఇవ్వాలని పార్టీ రీజినల్ ఇంచార్జ్ వైవి సుబ్బారెడ్డిని కోరాలని వాసుపల్లి సిద్ధమవుతున్నాడటఅయితే సీతంరాజు సుధాకర్ కూడా తనకి ఆ పోస్టర్లతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేస్తున్నాడట. వాసుపల్లి గణేష్ టిడిపి నుంచి వైసీపీలోకి రావడం వైసిపి శ్రేణులకి వాసుపల్లితో వచ్చిన టిడిపి నేతలకు మధ్య సయోధ్య లేకపోవడం తో అక్కడ అంతర్గతంగా ఇబ్బందులు ఉన్నాయని, ఆయన పార్టీ మారతారని ఆయన సొంత అనుచరులే చెబుతున్నారని ఆ నేపథ్యంలోనే ఆయనకు సంబంధించిన వాళ్ళు ఎవరో ఈ పోస్టర్లు అంటించి ఉంటారని సుధాకర్ చెప్తున్నాడట. వైసిపి కార్యకర్తలు ఎవరు ఇలాంటి పని చేయరని, వాసుపల్లి అనుచరులు కాకపోతే, తెలుగుదేశం పార్టీ కానీ జనసేన కానీ చేసి ఉండొచ్చన్నది ఆయన వాదనట. అలాంటి పోస్టర్లు అంటించాల్సిన అవసరం తనకు లేదని, పార్టీ అధిష్టానం ఎలా చెప్తే అలా నడుచుకుంటానని సుధాకర్ చెప్తున్నాడట ఈ నేపథ్యంలో ఈసారి ఈ పోస్టర్ వ్యవహారాన్ని సీరియస్ గా తీసుకున్న గణేష్ తాడోపేడో తేల్చుకోవాలని నిర్ణయించుకోవడంతో మరొక రామచంద్రపురం లాంటి వ్యవహారం విశాఖ నగరంలో కూడా రాబోతోందన్నది రాజకీయ వర్గాలు విశ్లేషణ.

# హిందూపురం నుంచి బ్రాహ్మణీ..?

**జయభేరి, అనంతపురం :**

దివంగత ముఖ్యమంత్రి, తెలుగుదేశం వ్యవస్థాపక అధ్యక్షుడు, విశ్వవిఖ్యాత నందమూరి తారకరామారావు మనవరాలు, నందమూరి బాలకృష్ణ కుమార్తె, టీడీపీ అధినేత నారా చంద్రబాబు కోడలు, తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ సతీమణి నందమూరి బ్రాహ్మణి రాజకీయ అరంగేట్రం చేయనున్నారా అంటే రాజకీయ వర్గాల నుండి అవుననే సమాధానం వస్తున్నది. వచ్చే ఎన్నికలలో నారా బ్రాహ్మణి రాజకీయాలు అరంగేట్రం చేసే అవకాశాలే మెండుగా ఉన్నాయని అంటున్నారు. ఆమె రాజకీయ ప్రవేశంపై నారా, నందమూరి కుటుంబాలతో పాటు తెలుగు దేశం పార్టీలో చర్చలు జరుగుతున్నాయని పార్టీ వర్గాలే చెబుతున్నాయి. దీంతో ఆమె ఎక్కడ నుండి బరిలో దిగనున్నారు? ఇన్నాళ్లూ సైలెంట్ గా ఉన్న బ్రాహ్మణి ఇప్పుడు ప్రత్యక్ష రాజకీయాలలోకి రావడం వెనకున్న కారణాలేంటి? అన్న అనుమానాలు సహజంగానే అందరిలో వ్యక్తమౌతున్నాయి.నారా బ్రాహ్మణి విషయానికి వస్తే ఇప్పటికే ఆమె సమర్థురాలిగా పేరు తెచ్చుకున్న సంగతి తెలిసిందే. యూఎస్‌లో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో మాస్టర్స్ చేసిన బ్రాహ్మణి ఇప్పటికే హెరిటేజ్ గ్రూపులో కీలక పాత్ర పోషిస్తున్నారు. అంతేకాకుండా తన తండ్రి



చైర్మన్ గా ఉన్న బసవతారకం క్యాన్సర్ హాస్పటల్ ట్రస్ట్ కి బోర్డు సభ్యురాలిగా కొనసాగుతున్నారు. చిన్న నాటి నుంచి ఇటు సినీ, అటు రాజకీయ రంగాలను దగ్గరగా చూసిన నారా బ్రాహ్మణి తనకు ఇష్టమైన వ్యాపార రంగంలోకి వెళ్లి దిగ్విజయంగా ముందుకెళ్తున్నారు. హెరిటేజ్ ఫుడ్స్ వ్యాపారాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారు. పలు సేవా కార్య క్రమాలను చేపట్టడంలో కూడా ఆమె ముందున్నారు. హెరిటేజ్ సంస్థలో పనిచేస్తున్న పేద కార్మి కుల పిల్లల చదువు కోసం ఆమె ఎంతో తపిస్తారని ఆ సంస్థ ఉద్యోగులు చెబుతున్నారు. ఆమె సమర్థతకి నిదర్శనమే అప్పటికే లాభాలలో ఉన్న హెరిటేజ్ సంస్థను ప్రపంచ వ్యాప్తంగా విస్తరిస్తూ ముందుకెళ్లడం.ఇప్పుడు ఆమె రాజకీయాలలో కూడా అరంగేట్రం చేయనున్నారని అంటున్నారు. నిజానికి ఈ ప్రచారం కొత్తదేం కాదు. గతంలో విజయవాడ పార్లమెంట్ స్థానం నుంచి బ్రాహ్మణిని పోటీచేయిస్తే పరిస్థితి ఎలా ఉంటుందని టీడీపీ సర్వేలు చేయిస్తున్నదని కూడా ప్రచారం జరిగింది. చంద్రబాబుకు, కేశినేని నాని మధ్య చాలా గ్యాప్ రావడానికి కూడా బ్రాహ్మణి విషయం బయటికి పొక్కడమేనని అప్పట్లో నెట్టింట్లో వదంతులు షికార్లు చేశాయి. అయితే ఆమె రాజకీయ ప్రవేశం అప్పటికి కేవలం ప్రచారంగానే మిగిలిపోయింది. ఇప్పుడు మరోసారి బ్రాహ్మణి రాజకీయాలలోకి రానున్నారని, అది కూడా అసెంబ్లీకి పోటీ చేయనున్నారని ప్రచారం మొదలైంది. తన తండ్రి నందమూరి బాలక్రిష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్న హిందూపురం నుంచే 2024 ఎన్నికల్లో బ్రాహ్మణి పోటీ చేయవచ్చన్నది ఇప్పుడు రాజకీయ వర్గాలలో జరుగుతున్న చర్చ.హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పాటయ్యాక ఇప్పటి వరకూ అంతా పురుష ఎమ్మెల్యేలే ఉన్నారు. మహిళలు పోటీ చేసినా గెలవలేదు. ప్రధాన రాజకీయ పార్టీలు కూడా మహిళలకు ఇక్కడ టికెట్ ఇవ్వడం లేదు. అందుకే ఈసారి వైసీపీ ఈ మహిళా సెంటిమెంట్ అస్త్రాన్ని వాడుకోవాలని చూస్తుంది. గతంలో వైసీపీ నుండి 2014లో నవీన్ నిశ్చల్, 2019లో ఇక్బాల్ బాలయ్యపై పోటీ చేసి ఓడిపోయారు. జగన్ వేవ్ లో కూడా బాలయ్య గెలవగా.. ఇప్పుడు మూడవసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని ఉన్నారు బాలయ్య. అయితే, వైసీపీ హిందూపురం ఇంచార్జి పదవిని మహిళా నేత టీఎన్ దీపికకు అప్పగించింది.తెలుగుదేశం కూడా ఇక్కడ మహిళా నేతనే బరిలోకి దించాలని భావిస్తున్నదని తెలుగుదేశం వర్గాలు చెబుతున్నాయి. ఇందుకు నారా బ్రాహ్మణి బెస్ట్ అప్షన్ గా తెలుగుదేశం నిర్ణయించిందని ప్రచారం జరుగుతున్నది. అంతకు ముందు తన తాత, ఆ తరువాత తండ్రి ప్రాతినిథ్యం వహించిన నియోజకవర్గంలో ఇప్పుడు కుమార్తె పోటీకి దిగడం మంచి పరిణామమే అవుతుందని టీడీపీ నేతలు భావిస్తున్నట్లు తెలుస్తున్నది. మరి అప్పటి లాగా ఇది కూడా ప్రచారంగానే మిగిలిపోతుందో.. లేక ఈసారి నిజంగానే బ్రాహ్మణి రాజకీయ అరంగేట్రం ఉంటుందో చూడాల్సి ఉంది.

# వెస్టిండీస్‌పై టీమిండియా సునాయాస విజయం

## మెరిసిన స్పిన్నర్లు.. రాణించిన ఇషాన్

వెస్టిండీస్ గడ్డపై వన్డే సిరీస్‌లో టీమిండియా శుభారంభం చేసింది. మూడు వన్డే సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో విండీస్‌పై భారత జట్టు సునాయాసంగా గెలిచింది. బార్బడోస్ వేదికగా నేడు (జూలై 27) జరిగిన తొలి వన్డేలో భారత్ 5 వికెట్ల తేడాతో వెస్టిండీస్‌పై గెలిచింది. లక్ష్యఛేదనలో 163 బంతులు మిగిలి ఉండగానే విజయం సాధించింది. భారత స్పిన్నర్లు కుల్‌దీప్ యాదవ్ (4/6) నాలుగు, రవీంద్ర జడేజా (3/37) మూడు వికెట్లతో చెలరేగటంతో తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ విలవిల్లాడింది. 23 ఓవర్లలోనే 114 పరుగులకే కుప్పకూలింది. విండీస్ కెప్టెన్ షాయ్ హోప్ (43) ఒక్కడే రాణించాడు. మిగిలిన బ్యాటర్ల విఫలమయ్యారు. హార్దిక్ పాండ్యా, ముకేశ్ కుమార్, శార్దూర్ ఠాకూర్‌కు చెరో వికెట్ దక్కింది. స్వల్ప లక్ష్య ఛేదనలో టీమిండియా కాస్త తడబడినా చివరికి సునాయాస విజయాన్ని దక్కించుకుంది. భారత ఓపెనర్ ఇషాన్ కిషన్ (46 బంతుల్లో 52 పరుగులు; 7 ఫోర్లు, ఓ సిక్స్) అర్ధ సెంచరీతో ఆకట్టుకున్నాడు. 22.5 ఓవర్లలో 5 వికెట్లకు 118 పరుగులు చేసి, గెలిచింది టీమిండియా. వెస్టిండీస్ బౌలర్లలో గుడకేశ్ మోతీ రెండు, సీల్స్, కారియా చెరో వికెట్ దక్కించుకున్నారు. మ్యాచ్ ఎలా సాగిందంటే.. టాస్ గెలిచిన భారత జట్టు తొలుత బౌలింగ్ ఎంపిక చేసుకోవడంతో విండీస్ బ్యాటింగ్‌కు బరిలోకి దిగింది. వెస్టిండీస్ ఓపెనర్ కైల్ మేయర్స్(2)ను టీమిండియా స్టార్ హార్దిక్ పాండ్యా మూడో ఓవర్లోనే ఔట్ చేశాడు. ఆ తర్వాత కాసేపు నిలకడగా ఆడిన బ్రెండన్ కింగ్ (17)ను శార్దూల్ ఠాకూర్, అలిక్ అథనాజే (22)ను డెబ్యూంట్ ముకేశ్ కుమార్ పెవిలియన్‌కు పంపారు. అనంతరం, భారత స్పిన్నర్లు రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్ రాకతో వెస్టిండీస్ మరింత వేగంగా పతనమైంది. షిమ్రన్ హిట్మైర్ (11)ను 16వ ఓవర్లో బౌల్డ్ చేసిన జడేజా.. రవ్‌మన్ పావెల్ (4), రొమారియో షెఫర్డ్ (0)ను 18వ ఓవర్లో పెవిలియన్‌కు పంపాడు. దీంతో 96 పరుగలకే వెస్టిండీస్ ఆరు వికెట్లను నష్టపోయింది.



మరో ఎండ్‌లో వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్ నిలకడగా ఆడాడు. అనంతరం భారత మణికట్టు స్పిన్నర్ కుల్‌దీప్ రెచ్చిపోయాడు. డొమెనిక్ డ్రేక్స్ (3), యానిక్ కారియా (3)తో పాటు హోప్‌ను కూడా ఎల్‌బీడబ్ల్యూ చేశాడు. అనంతరం జేడన్ సీల్స్(0)ను కూడా ఔట్ చేశాడు. దీంతో వెస్టిండీస్ 23 ఓవర్లలో 114 పరుగులకే కుప్పకూలింది. వెస్టిండీస్ బ్యాటింగ్ లైనప్‌లో ఏడుగురు బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. షాయ్ హోప్, అథనాజే మినహా మరెవరూ ఇరవై పరుగుల మార్క్ దాటలేదు. స్వల్ప లక్ష్యమే కావడంతో ఓపెనింగ్‌లో టీమిండియా ప్రయోగం చేసింది. రోహిత్ శర్మ రాకుండా ఓపెనింగ్‌కు శుభ్‌మన్ గిల్ (7), ఇషాన్ కిషన్ వచ్చారు. అయితే, గిల్ నాలుగో ఓవర్లోనే సీల్స్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. అనంతరం ఇషాన్, సూర్య కుమార్ యాదవ్ (19) నిలకడగా ఆడారు. క్రమంగా పరుగులు రాబట్టారు. వీలుచిక్కినప్పుడల్లా బౌండరీలు బాదారు. అయితే ఈ క్రమంలో 11వ ఓవర్లో సూర్య.. ఎల్‌బీడబ్ల్యూ అయ్యాడు. కాసేపటికే హార్దిక్ పాండ్యా (5) రనౌట్ అవటంతో కాస్త టెన్షన్ ఏర్పడింది. అయితే, మరో ఎండ్‌లో ధీటుగా ఆడిన ఇషాన్ కిషన్ 44 బంతుల్లో అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత ఎక్కువ సేపు నిలువలేకపోయాడు. మోతీ బౌలింగ్‌లో పోవెల్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. శార్దూల్ ఠాకూర్ (1)ను బ్యాటింగ్ ఆర్డర్లో ముందుకు పంపగా అతడు కూడా కారియా బౌలింగ్‌లో త్వరగానే ఔటయ్యాడు. అయితే, రవీంద్ర జడేజా (16 నాటౌట్), కెప్టెన్ రోహిత్ శర్మ (12 నాటౌట్) మరో వికెట్ పడకుండా జాగ్రత్త పడ్డారు. జట్టును విజయ తీరాలకు చేర్చారు. భారత స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.



## వరల్డ్ రికార్డు క్రియేట్ చేసిన నార్వే మహిళ

మూడు నెలల్లోనే 14 పర్వతాలూ ఎక్కేశారు. వరల్డ్ రికార్డు క్రియేట్ చేశారు ఓ నార్వే మహిళ, మరో నేపాలీ షేర్పా. తాజాగా పాకిస్థాన్ లోని మౌంట్ కే2ని కూడా జయించారు. ఓ నార్వే మహిళ, నేపాలీ షేర్పా చరిత్ర సృష్టించారు. ప్రపంచంలో అత్యంత వేగంగా 8 వేల మీటర్లకుపైగా ఉన్న 14 పర్వతాలను ఎక్కిన రికార్డును సొంతం చేసుకున్నారు. నార్వే మహిళ పేరు క్రిస్టిన్ హరీలా కాగా.. నేపాలీ షేర్పా పేరు టెన్‌జెన్. తాజాగా వాళ్లు పాకిస్థాన్ లోని ప్రపంచంలోనే రెండో అత్యంత ఎత్తయిన పర్వతం (8611 మీటర్లు) ఎక్కి ఈ రికార్డు క్రియేట్ చేశారు. ఈ ఇద్దరూ కలిసి మరో 8 మంది ట్రెక్కర్లతో కలిసి మౌంట్ కే2 ఎక్కారు. ఇలా కేవలం మూడు నెలల్లోనే ప్రపంచంలోని మొత్తం 14 పర్వతాలను ఎక్కేయడం విశేషం. సాధారణంగా ఈ ఘనత సాధించడానికి కొందరు క్లైంబర్స్ కు కొన్నేళ్లు పడుతుంది. ఇంతకుముందు 2019లో నేపాల్ కు చెందిన నిర్మల్ పూర్జా ఆరు నెలల్లో ఈ 14 పర్వతాలు ఎక్కిన రికార్డు అందుకుంది. ఇప్పుడా రికార్డును క్రిస్టిన్, టెన్‌జెన్ బ్రేక్ చేశారు. ఈ రికార్డును గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు ఇంకా గుర్తించాల్సి ఉంది. ఏప్రిల్ 26న తొలిసారి ఈ ఇద్దరూ చైనాలోని షిషాపంగ్మా ఎక్కారు. ఎవరెస్ట్, కాంచన్‌జంగా, లోట్సె, మకాలు, చో ఒయు, దౌలగిరి, మనస్లు, అన్నపూర్ణ, నంగా పర్బత్, గాషెర్‌బ్రమ్ 1, గాషెర్‌బ్రమ్ 2, బ్రాడ్ పీక్, మౌంట్ కే2లను అధిరోహించారు. ఈ 14 పర్వాతలను కేవలం 92 రోజుల వ్యవధిలోనే ఎక్కేయడం విశేషం. వీళ్లతోపాటు తాజాగా మౌంట్ కే2 పర్వతం అధిరోహించిన వాళ్లలో నేపాల్ కు చెందిన 17 ఏళ్ల నీమా రిన్‌జిన్ షేర్పా కూడా ఉన్నారు. కే2ని అధిరోహించిన అత్యంత పిన్న వయసు వ్యక్తిగా రికార్డు క్రియేట్ చేశారు.

## జగనన్న విదేశీ విద్యా దీవెన

**5 మంది విద్యార్థులకు 64,24,012 రూ. లబ్ధిదారుల ఖాతాల్లో నగదు**

**జయభేరి, నంద్యాల :**

జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం సంబంధించి 202223 సంవత్సరానికి సంబంధించి 5 మంది విద్యార్థులకు 64,24,012 రూపాయలు లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేశామని జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ పేర్కొన్నారు. గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన 357 మంది విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో 45.53 కోట్ల రూపాయలను కంప్యూటర్ బటన్ నొక్కి నేరుగా జమ చేసే బృహత్తర వర్చువల్ కార్యక్రమాన్ని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ నుండి జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, మార్క్ ఫెడ్ చైర్మన్ పిపి నాగిరెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ డిడి చింతామణి, మైనారిటీ సంక్షేమ అధికారి సబిహా పర్వీన్,బీసీ సంక్షేమ అధికారి లక్ష్మీదేవి, విద్యార్థులు, విద్యార్థుల తలిదండ్రులు తదితరులు వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ మాట్లాడుతూ పేదరికం కారణంగా ఉన్నత విద్యాభ్యాసం కోసం విదేశాలకు వెళ్లి చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం ప్రవేశ పెట్టిందన్నారు. ఈ పథకం క్రింద జిల్లాలో 202223 సంవత్సరానికి సంబంధించి 5 మంది విద్యార్థులకు 64,24,012 రూపాయలు లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేశామన్నారు. పీజీ, పీహెచ్‌డీ, ఎంబీబీఎస్ కోర్సులకు సంబంధించి జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం ఎంతో మేలు చేకూర్చిందని కలెక్టర్ వివరించారు. ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక సహాయాన్ని పేద విద్యార్థులు చక్కగా సద్వినియోగం చేసుకొని చదువులో రాణించి ఉన్నత పదవులను అలంకరించాలని కలెక్టర్ వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీ, మార్క్ ఫెడ్ చైర్మన్, తదితరుల చేతుల మీదుగా విద్యార్థులు, విద్యార్థుల తల్లులకు చెక్కును అందజేశారు.

# సీనియర్ల సేవలు పార్టీకే

**జయభేరి, విజయవాడ :**

ఏపీలో వచ్చే ఏడాది ఎన్నికలు జరగనుండగా ఇప్పటి నుండే రాజకీయ పార్టీలు అందుకు సమాయత్తమవుతున్నాయి. ముఖ్యంగా వైసీపీ తమ పార్టీలో ఏం జరుగుతున్నది? రానున్న ఎన్నికలలో గెలవాలంటే ఏం చేయాలి? ఎమ్మెల్యేల పనితీరు ఎలా ఉంది? గెలుపు గుర్రాలు ఎవరు? తమ పార్టీకి నష్టం తెచ్చిపెట్టే ఎమ్మెల్యేలు ఎవరనే దానిపై ఫోకస్ పెట్టింది.ఇప్పటికే ఎన్నోసార్లు ఎమ్మెల్యేలు, ఎంపీల పనితీరు, నియోజకవర్గాలలో పరిస్థితిపై సర్వేలు తెప్పించుకున్న సీఎం జగన్ మోహన్ రెడ్డి.. ఆ నివేదికల ఆధారంగానే సీట్ల కేటాయింపు ఉంటుందన్న క్లారిటీ పార్టీ నేతలకు, శ్రేణులకు ఇచ్చేశారు. పనితీరు సరిగా లేని ఎమ్మెల్యేలకు టికెట్లు ఇచ్చేది లేదని కూడా కుండబద్దలు కొట్టేశారు. ఎమ్మెల్యేలతో పాటు మరోవైపు సీఎం జగన్ మోహన్ రెడ్డి ఎంపీ టికెట్ల విషయంపై కూడా ఫోకస్ పెట్టారు. గత ఎన్నికల్లో వైసీపీ 22 మంది ఎంపీలు విజయం సాధించగా, నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణం రాజు రెబల్ గా మారారు. ఇక వైసీపీకి ఇప్పుడున్న 21 మందిలో నలుగురు ఎంపీలు వచ్చే ఎన్నికల్లో తాము ఎంపీగా పోటీ చేయలేమని, అసెంబ్లీకి వెళ్లాలని అనుకుంటున్నట్లుగా అధిష్టానానికి తెలిపినట్లు ప్రచారం జరుగుతోంది. వారిలో అనకాపల్లి ఎంపీ బీశెట్టి సత్యవతి, అరకు ఎంపీ గొట్టేటి మాధవి, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, కాకినాడ ఎంపీ వంగా గీత ఉన్నారు. దీనికి వైసీపీ నుండి ఎలాంటి స్పందనా



రాకపోవడంతో వారు చాలా కాలంగా ఈ నలుగురు పార్టీకి కూడా దూరంగానే ఉంటున్నారు. ఈ క్రమంలో ఈ నాలుగు స్థానాలలో వైసీపీ కొత్త వారి కోసం వేట మొదలు పెట్టింది.మరో నలుగురు ఎంపీలను ఈసారి అసెంబ్లీకి పంపాలని జగన్ స్వయంగా నిర్ణయించుకున్నట్లు తెలుస్తున్నది. అలాంటి వారిలో హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి ఉన్నారు. మొత్తంగా ఈ ఎనిమిది పార్లమెంట్ స్థానాలకు వైసీపీ కొత్త అభ్యర్థులను దించాల్సి ఉండగా.. మరో ముగ్గురు ఎంపీలు వారి మూడు స్థానాలలో ఓటమి చూడడం ఖరారని నివేదికలు రావడంతో వారిని కూడా మార్చాలని జగన్ భావిస్తున్నారు. అంటే మొత్తంగా 21 మందిలో పది మంది పాత వారికి మాత్రమే ఎంపీ టికెట్లు ఇవ్వనుండగా 11 మంది స్థానాలలో కొత్త వారిని దించనున్నారు. కాగా, ఈసారి వైసీపీ సీనియర్ నేతలను పార్లమెంట్ కు బరిలో దింపాలని పార్టీ పెద్దలు భావిస్తున్నట్లు తెలుస్తుంది. ఉత్తరాంధ్రాలో విజయనగరం నుంచి మంత్రి బొత్స సత్యనారాయణ, అనకాపల్లి లేదా విశాఖ నుంచి అవంతి శ్రీనివాసరావు, కాకినాడ లోక్ సభ స్థానం నుంచి కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఏలూరు నుంచి మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ళ నాని, నెల్లూరు నుంచి మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ లను లోక్ సభకు పంపాలని జగన్ భావిస్తున్నారని పార్టీ శ్రేణులే చెబుతున్నాయి.

ఇప్పటికే ఆయా నాయకులకు పార్టీ నుండి ఆదేశాలు కూడా వెళ్లాయంటున్నారు. కాగా, ప్రస్తుతం ఎమ్మెల్యేలుగా ఉన్న వారిలో నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకరరెడ్డిని నెల్లూరు రూరల్ నుంచి, హిందూపురం ఎంపీగా ఉన్న గోరంట్ల మాధవ్ ని కర్నూల్ జిల్లాలో ఆయన సామాజికవర్గం అధికంగా ఉన్న సీటు నుంచి ఎమ్మెల్యేగా, విజయనగరం జిల్లా ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ని ఎచ్చర్ల నుంచి అసెంబ్లీకి పోటీ చేయించేందుకు కసరత్తులు మొదలు పెట్టగా.. ఈసారి ఎలాగైనా అసెంబ్లీకి వెళ్లాలని ఆలోచన చేస్తున్న మిగతా ఎంపీల అసంతృప్తిని ఎలా చల్లార్చాలా అని మల్లగుల్లాలు పడుతున్నారంటున్నారు. జగన్ నిర్ణయం రుచించని వారు రెబల్స్ గా మారుతారన్న ఆందోళన కూడా పార్టీలో వ్యక్తమౌతోందంటున్నారు.

## రహదారికి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్

**జయభేరి, మహబూబ్ నగర్ :**

బూరుగుపల్లి ఆలూరు రహదారికి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ మహబూబ్ నగర్ బీసీ సేన జిల్లా ఉపాధ్యక్షులు ఆకుల శ్రీనివాస్ నేతృత్వం లో రోడ్డుపై నాటు వేసి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ బూరుగుపల్లి గ్రామం నుండి ఆలూరు గ్రామ జిల్లా పరిషత్ పాఠశాలకు నిత్యం విద్యార్థులతో పాటు ఇరు గ్రామాల రైతులు, భూత్పూర్, దివిటి పల్లి,మహబూబ్ నగర్ నుండి నాగర్ కర్నూల్ ఇతర పట్టణాలకు వెళ్లడానికి నిత్యం వేలాదిమంది ఈ రోడ్డు గుండానే ప్రయాణిస్తుంటారని తెలిపారు. రోడ్డు గుంతల మయమైన వర్షం పడితే చెరువులను తలపిస్తుందని ప్రయాణికులు విద్యార్థులు పాఠశాలకు రావడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ఇట్టి విషయమై సంబంధిత అధికారులు, ఎమ్మెల్యే దృష్టికి తెసుకేల్లిన ప్రయోజనం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు.స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో,, బీసీ సేన నియోజకవర్గం కార్యదర్శి రామస్వామి , బీసీ సేన నాయకులు పాల్మాకుల రఘు, కార్మికు విభాగ మండల అధ్యక్షులు చంద్రమౌళి బీసీ సేనమండల అధ్యక్షులు బొల్లెమోని నిరంజన్, భీమయ్య, ప్రకాష్, కుర్మేష్, రమేష్, శేఖర్, పవన్ లు తదితరులు పాల్గొన్నారు

## సమగ్ర పోషకాల ద్వారానే సుస్థిర వ్యవసాయం

**జయభేరి, హైదరాబాద్ :**

జూలై 27న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 125000 ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాలను దేశానికి అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు రసాయనాలు మరియు ఎరువుల మంత్రిత్వ శాఖ వారు దేశ వ్యాప్తంగా 9 కేంద్రాలను ఎంపిక చేశారు. ఇందులో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ షామీర్ పేటలో ఏర్పాటుచేసిన పిఎం కేఎస్ కే కి చోటు లభించింది. ఈ కార్యక్రమంలో కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి పాల్గొని పి యం కెఎస్ కేఎస్ ప్రాముఖ్యతను కేంద్ర ప్రభుత్వం రైతులకు చేసే సేవలను ఎరువుల పైన గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కోరమండల్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులు జీవీ సుబ్బారెడ్డి బిజినెస్ హెడ్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లాకు చెందిన 500 మంది పైగా రైతులు పాల్గొన్నారు. ప్రధానమంత్రి సల్ఫర్ కోటెడ్ యూరియాను ఆవిష్కరించారు. మరియు పిఎం కిసాన్ నిధుల 14వ విడత పంపిణీలో భాగంగా 8.5 కోట్ల రైతులకు 17, 500 కోట్ల విడుదల చేశారు. కోరమండల్ సంస్థ ప్రతినిధులు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏర్పాటుచేసిన 4200 పిఎంకెఎస్కే కేంద్రాలలో ఈ కార్యక్రమం యొక్క ప్రత్యక్ష ప్రసారాన్ని రైతుల కోసం ప్రదర్శించారు సుస్థిర వ్యవసాయం మరియు సమగ్ర పోషక యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. ఈ సందర్భంగా వైస్ ప్రెసిడెంట్ జీవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ పిఎంకెఎస్కే కేంద్రాల ద్వారా భూసార పరీక్ష మరియు విస్తరణ సేవలు వినియోగించుకోవాల్సిందిగా రైతులకు విజ్ఞప్తి చేశారు. బిజినెస్ హెడ్ మాధవ్ మాట్లాడుతూ కోరమండల్ సంస్థ వారు రైతులకు శ్రేష్టమైన ఎరువులను సూక్ష్మ పోషకాలను మరియు సేంద్రియ ఎరువులను తగిన మోతాదులో అందించడం ద్వారా రైతుల ఆర్థిక పూర్వకమణానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పి భాస్కర్ రెడ్డి, డాక్టర్ వినయ్ కుమార్ పరీడ, డాక్టర్ సుధాకర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, పి ప్రసాద్, డి వి ఎల్ ఎన్ రాజు, అవినాష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు

## జిల్లా యంత్రాంగం అప్రమత్తం

**జయభేరి, కర్నూలు :**


జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు సహా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని టెలికాన్ఫరెన్స్లో సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ డా. జి. సృజన అదేశించారు. గురువారం ఉదయం వర్షాల నేపథ్యంలో ఆర్డీవోలు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆర్డీఓలు,తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు సహా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని టెలికాన్ఫరెన్స్లో సంబంధిత అధికారులను కలెక్టర్ అదేశించారు. ముఖ్యంగా తుంగభద్ర జలాశయానికి ఇన్ ఫ్లో మొదలైందని, లోతట్టు ప్రాంతాలు, ముంపుకి గురవుతున్న ప్రాంతాలలో పర్యటించి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. మరి ముఖ్యంగా గ్రామాల్లో ఎక్కడైనా పునరావాస శిబిరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంటే డివిజనల్ లెవెల్ అధికారులు నా దృష్టికి తీసుకుని వచ్చినట్లయితే అందుకు తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. సంబంధిత మండలాల్లో వర్ష ప్రభావం ఎలా ఉందని అందుకు తగిన చర్యలు ఏ విధంగా తీసుకుంటున్నారని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆరా తీశారు. ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ మాట్లాడుతూ ఇప్పటివరకు పరిస్థితి బాగుందని మంత్రాలయంలో నిన్న రాత్రి వర్షం ఎక్కువ కురిసిందని తెలిపారు. తహసిల్దార్లను వీఆర్వోలను అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశామని, ఎక్కడైనా పునరావాస శిబిరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంటే అందుకు తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కి తెలిపారు. కర్నూల్ ఆర్డీవో హరి ప్రసాద్ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు తహసిల్దార్లను వీఆర్వోలను అప్రమత్తంగా ఉంచుతున్నామని, నదులు వంకలు వాగులలో వరద నీటి ప్రవాహం ఉన్నచోట ప్రజలు వాటిని దాటి వెళ్లకుండా వీఆర్వోలను అక్కడ పెట్టామని కలెక్టర్ కి తెలియజేశారు. పత్తికొండ ఆర్డిఓ మోహన్ దాస్ మాట్లాడుతూ కర్ణాటకలో వర్షాలు పడితే వేదవతి నదికి వస్తాయని ప్రస్తుతానికి కర్ణాటక నుండి ఎటువంటి వాటర్ ఫ్లో లేదని, వర్షాలు ఎక్కువ పడితే ఆలూరు మండలంలో ఉన్న కల్లేవంక పారుతుందని ఆ ప్రాంతం దగ్గరికి తహశీల్దార్ వెళ్లి అధిక వర్షాలు పడి వంక పారినట్లయితే ప్రజలు ఎవరు వాటిని దాటకుండా దండోరా వేయించారని ఎటువంటి వాహనాలు కూడా వెళ్లకుండా తల్లారిలను అక్కడ పెట్టారని కలెక్టర్ కి తెలియజేశారు. కర్నూల్ నగరపాలక కమిషనర్ భార్గవ్ తేజ మాట్లాడుతూ తుంగభద్ర జలాశయానికి ఇన్ ఫ్లో మొదలైందని పరిసరాల్లో ఉన్నటువంటి లోతట్టు ప్రాంతాలను పర్యవేక్షిస్తున్నామని కలెక్టర్ కి తెలిపారు. టెలికాన్ఫరెన్స్లో నగరపాలక కమిషనర్ భార్గవ్ తేజ, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, కర్నూల్, పత్తికొండ ఆర్డీవోలు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు

## పిఎం కిసాన్ 14వ విడత డబ్బులు విడుదల

**జయభేరి, తుగ్గలి :**

పిఎం కిసాన్ 14వ విడత డబ్బులను పీఎం నరేంద్ర మోడీ విడుదల చేసినట్లు మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ తెలియజేశారు.గురువారం రోజున మండల కేంద్రమైన తుగ్గలిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏవో మాట్లాడుతూ మండలంలో 15,289 మంది రైతులకు 2000 రూపాయలు 14వ విడత లో లబ్ధి పొందనున్నారు.ఇంకా 759 మంది రైతులు ఈ కేవైసి చేయని కారణంగా వారికి లబ్ధి చేకూరలేదని ఆయన అన్నారు. వారు కూడా తక్షణమే ఈ కేవైసి చేసుకోవాలని కోరారు.అలాగే ఈరోజు గౌరవ ప్రధాన మంత్రి చేతుల మీదుగా ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాలు ప్రారంభించబడ్డాయి.ఈరోజు తుగ్గలి మండలంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఆగ్రో ట్రేడర్స్ డీలర్ షాపు నందు ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రం ప్రారంభించబడింది.ఈ కేంద్రాల ద్వారా రైతులకు కావలసిన విత్తనాలు,ఎరువులు, పురుగు మందులు,వ్యవసాయ సామాగ్రి మరియు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఏఓ తెలియచేశారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్,బిజెపి మండల అధ్యక్షులు లక్ష్మణ స్వామి నాయుడు, ప్రధాన కార్యదర్శి లక్ష్మన్న, కార్యదర్శి రామకృష్ణ, విఏఏ లోహిత్ కుమార్ ,డీలర్ మనిధర్,హైదర్ భాష మరియు గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ధనుష్, శేఖర్ కమ్ముల #D51 అనౌన్స్ మెంట్



ధనుష్ 51వ చిత్రం లెజండరీ నిర్మాత, డిస్ట్రిబ్యుటర్, ఎగ్జిబిటర్ శ్రీ నారాయణ్ దాస్ కె నారంగ్ జయంతి సందర్భంగా అధికారికంగా అనౌన్స్ చేశారు. ఈ చిత్రం కోసం నేషనల్ అవార్డ్ విన్నర్ ధనుష్, టాలీవుడ్ మోస్ట్ సెన్సిబుల్ డైరెక్టర్, నేషనల్ అవార్డ్-విన్నింగ్ ఫిల్మ్ మేకర్ శేఖర్ కమ్ములతో చేతులు కలపనున్నారు.ధనుష్, శేఖర్ కమ్ముల కాంబినేషన్ లోని క్రేజీ చిత్రం #D51ని నారాయణ్ దాస్ కె నారంగ్ ఆశీర్వా-దంతో నిర్మాతలు సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్ మోహన్ వారి నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్పి (ఏషియాన్ గ్రూప్)లో అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి మల్టీ లాంగ్వేజస్(తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం, హిందీ) లో భారీ స్థాయిలో రూపొందించనున్నారు. సోనాలి నారంగ్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ధనుష్ పుట్టినరోజు (జులై 28) సందర్భంగా మేకర్స్ #D51 కాన్సెప్ట్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇంతకు ముందెన్నడూ చూడని అవతార్‌లో ధనుష్‌ని చూపించే పర్ఫెక్ట్ కథను శేఖర్ కమ్ముల సిద్ధం చేశారు. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో తెలియజేస్తారు. తారాగణం: ధనుష్, దర్శకత్వం: శేఖర్ కమ్ముల




## ట్రయాంగిల్ లవ్ స్టోరీ దిల్ సే

శ్రీ చైతన్య క్రియేషన్స్, శ్రీరామ్ క్రియేషన్స్ బ్యానర్ పై అభినవ్ మదిశెట్టి , స్నేహ సింగ్ హీరో హీరోయిన్లు గా మంకల్ వీరేంద్ర , రవికుమార్ సబ్బాని స్వీయ దర్శకత్వంలో వస్తోన్న సినిమా దిల్ సే. ట్రయాంగిల్ లవ్ స్టోరీతో వస్తోన్న ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకొని ఆగస్ట్ 4న థియేటర్స్ లో విడుదల కాబోతోంది. ఇటీవల విడుదలైన ఈ సినిమా మొదటి సాంగ్ 'రెండు కన్నులతో' కు మంచి స్పందన లభించింది. లహరి మ్యూజిక్ ద్వారా విడుదలైన ఈ పాట 2 మిలియన్ వ్యూస్ కు చేరుకుంది. శ్రేయ ఘోషల్ పాడిన ఈ పాటకు నూతన సంగీత దర్శకుడు శ్రీకర్ సంగీతం అందించాడు. యూత్ తో పాటు ఫ్యామిలీ ఆడియన్స్ కు కూడా నచ్చే విధంగా 'దిల్ సే' ఉండబోతుందని చిత్ర యూనిట్ చెబుతోంది. ఒన్ మీడియా ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చెయ్యబోతోంది. నటీనటులు:అభినవ్ మేడిశెట్టి, సశ్య సింగ్, లవ్లీ సింగ్, విస్మయ శ్రీ, వెంకటేష్ కాకుమాను తదితరులు


## వంద మిలియన్ల వ్యూస్‌తో 'నా రోజా నువ్వే'

డాషింగ్ హీరో ది విజయ్ దేవరకొండ, సమంత కలిసి నటిస్తున్న పాన్ ఇండియన్ చిత్రం ఖుషి. శివ నిర్వాణ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. మైత్రీ మూవీస్ నిర్మిస్తోన్న ఈ సినిమా సెప్టెంబర్ 1న విడుదల కాబోతోంది. ఈ మధ్యే ఈ మూవీ షూటింగ్ పూర్తయింది. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను ప్రారంభించింది చిత్రయూనిట్. ఖుషి సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్ ప్రస్తుతం స్వింగులో ఉన్నాయి. ఈ చిత్రం నుంచి ఇప్పటికే నా రోజా నువ్వే, ఆరాధ్య వంటి పాటలు వచ్చాయి. యూట్యూబ్‌లో ఇప్పటికీ ట్రెండ్ అవుతూ చార్ట్ బస్టర్‌లుగా నిలిచాయి. ఇక తాజాగా ఈ చిత్రంలోని మొదటి పాట అయిన నా రోజా నువ్వే వంద మిలియన్ల వ్యూస్‌ను క్రాస్ చేసింది. వంద మిలియన్ల వ్యూస్‌ను కొల్లగొట్టిన నా రోజా నువ్వే పాట ఇప్పుడు మరోసారి నెట్టింట్లో ట్రెండ్ అవుతోంది. గత పదకొండు వారాలుగా ఈ పాట ఎక్కడో చోట ట్రెండ్ అవుతూనే వస్తోంది. ఇక ఈ మూవీ నుంచి జూలై 28న మరో పాట విడుదల కానుంది. ఖుషి టైటిల్ సాంగ్‌ను రేపు విడుదల చేయబోతోన్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోన్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 1న తెలుగుతో పాటు తమిళ్, మళయాల, కన్నడ, హిందీ భాషల్లో విడుదల చేయబోతోన్నారు. నటీనటులు: విజయ్ దేవరకొండ, సమంత, జయరాం, సచిన్ ఖేడేకర్, మురళీ శర్మ, లక్ష్మి, అలీ, శరణ్య పొన్ వణ్నన్, రోహిణి, వెన్నెల కిషోర్, రాహుల్ రామకృష్ణ, శ్రీకాంత్ అయ్యంగార్, శరణ్య ప్రదీప్ తదితరులు.



## 'భోళా శంకర్' ట్రైలర్ లాంచ్ గ్లోబల్ స్టార్ రామ్ చరణ్

మెగాస్టార్ చిరంజీవి మోస్ట్ ఎవైటెడ్ మెగా మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భోళా శంకర్'. స్టైలిష్ మేకర్ మెహర్ రమేష్ దర్శకత్వంలో రామబ్రహ్మం సుంకర గ్రాండ్‌గా నిర్మిస్తున్న ఈ చిత్రం మెగా మాసీవ్ ప్రమోషనల్ కంటెంట్ తో స్ట్రాంగ్ బజ్ ని క్రియేట్ చేస్తోంది. టీజర్ నుంచి పాటల వరకు సినిమాకు సంబంధించిన ప్రతి ప్రమోషనల్ ఎలిమెంట్ తో ఆకట్టుకున్న మేకర్స్ ఈ రోజు థియేట్రికల్ ట్రైలర్ తో ముందుకు వచ్చారు. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ట్రైలర్ ని లాంచ్ చేశారు. భోళా శంకర్ ట్రైలర్ కోల్‌కతాలోని అందోళనకర పరిస్థితులలో ఆసక్తికరమైన నోట్ తో ప్రారంభమవుతుంది. చాలా మంది యువతులు కిడ్నాప్ అవుతారు. వారి తల్లిదండ్రులు, పోలీసులు భయాందోళనలో వుంటారు. ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ, కిడ్నాప్‌ల వెనుక ఉన్న సూత్రధారిని పోలీసులు కనుగొనలేకపోతారు. అప్పుడు భోళా శంకర్.. నేరస్థుడిని పట్టుకోవడానికి, అమ్మాయిలను రక్షించడానికి వస్తాడు. సీరియస్‌గా ప్రారంభమైన కథనం ఒకదాని తర్వాత ఒక ప్రధాన పాత్రల ప్రవేశంతో వినోదాత్మకంగా మారుతుంది. చిరంజీవి వింటేజ్ అవతార్‌లో కనిపించి తన మాస్ పవర్‌ను మరోసారి చూపించారు. యాక్షన్‌తో పాటు వినోదాత్మక సన్నివేశాలలో కూడా ఎక్స్ టార్డినరిగా వున్నారు. డిఫరెంట్ సీన్స్ లో రాజశేఖర్, పవన్ కళ్యాణ్‌లను మెగాస్టార్ అనుకరిస్తూ కనిపించడం ఆసక్తికరంగా వుంది. తమన్నా భాటియా లాయర్‌గా, కీర్తి సురేష్ చిరంజీవి సిస్టర్ గా , సుశాంత్ ఆమె బాయ్ ఫ్రండ్ గా కనిపించారు. వెన్నెల కిషోర్ భోళా సీనియర్‌గా కనిపించడం నవ్వులు పూయించింది. ట్రైలర్ సూచించినట్లుగా భోళా శంకర్ ఒక మెగా మాస్ యాక్షన్ ఎంటర్టైనర్. ఈ సినిమా మాస్‌తో పాటు ఫ్యామిలీ ఆడియన్స్‌ని కూడా ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు దర్శకుడు మెహర్ రమేష్. డడ్లీ సినిమాటోగ్రఫీ అత్యున్నతంగా వుంది. మహతి స్వర సాగర్ తన సలైవ్లీ స్కోర్‌తో విజువల్‌స్‌ను నెక్స్ట లెవల్ కి తీసుకెళ్లాడు. అనిల్ సుంకర ఎకె ఎంటర్టైన్మెంట్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. నిర్మాణ ప్రమాణాలు వున్నత స్థాయిలో వున్నాయి. మార్తాండ్ కె వెంకటేష్ ఎడిటర్ గా, ఏఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్ గా పని చేస్తున్నారు. సత్యానంద్ కథ పర్యవేక్షణ చేయగా తిరుపతి మామిడాల డైలాగ్స్ అందిస్తున్నారు. కిషోర్ గరికిపాటి ఎగ్జిక్యూటివ్ నిర్మాత. భోళా శంకర్ ఆగస్టు 11న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. తారాగణం: చిరంజీవి, తమన్నా, కీర్తి సురేష్, సుశాంత్, రఘు బాబు, మురళీ శర్మ, రవిశంకర్, వెన్నెల కిషోర్, తులసి, సురేఖా వాణి, శ్రీ ముఖి, హైపర్ ఆది, వైవా హర్ష, ప్రదీప్, అనీ, బిత్తిరి సత్తి, సత్య, గెటప్ శ్రీను, వేణు టిల్లు, తాగుబోతు రమేష్, రష్మీ గౌతమ్, ఉత్తేజ్, వీర్, షావర్ అలీ & తరుణ్ అరోరా





## కేథరిన్ థెరిసా నూతన చిత్రం ప్రారంభం

ఆహా ఓటీటీలో విడుదలై అందరి ప్రశంసలు అందుకున్న ఓదెల రైల్వే స్టేషన్ చిత్ర దర్శకుడు అశోక్ తేజ దర్శకత్వంలో రూపొందనున్న నూతన చిత్రం గురువారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. పాపులర్ కథానాయిక కేథరిన్ థెరిసా హీరోయిన్‌గా, జార్జిరెడ్డి, వంగవీటి చిత్రాల కథానాయకుడు సందీప్ మాధవ్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రాన్ని కేసీఆర్ ఫిలిమ్స్, శ్రీమహా విష్ణు మూవీస్ బ్యానర్‌లపై దావులూరి జగదీష్, పల్లి కేశవరావులు నిర్మిస్తున్నారు. గురువారం జరిగిన ఈ చిత్రం ప్రారంభోత్సవానికి పలువరు సినీ ప్రముఖులు హాజరయ్యారు. హీరో, హీరోయిన్లలపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ దర్శకుడు సంపత్ నంది క్లాప్ నివ్వగా, ప్రముఖ నిర్మాత సి.కల్యాణ్ స్విచ్చాన్ చేశారు. ప్రసన్నకుమార్, జెమిని కిరణ్‌లు గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో దర్శకుడు మాట్లాడుతూ ఓదెల రైల్వే స్టేషన్‌ను చూసి నాకు ఈ అవకాశం ఇచ్చారు నిర్మాతలు. కథ వినగానే కేథరిన్, హీరో సందీప్‌లు ఎంతో ఆసక్తి చూపించారు. కథానాయకుడు సందీప్ మాట్లాడుతూ జార్జిరెడ్డి తరువాత చాలా కథలు విన్నాను. కానీ ఈ కథ వినగానే ఎంతో బాగా నచ్చింది. ప్రతి సన్నివేశం ఎంతో ఆసక్తికరంగా వుంటుంది. ఈ సినిమాలో అలాంటి పాత్ర దొరికింది.హీరోయిన్ కేథరిన్ పాత్రను కూడా దర్శకుడు ఎవరూ ఎక్స్‌పెక్ట్ చేయని రీతిలో డిజైన్ చేశాడు. సినిమాకు మంచి టీమ్ కుదరింది అన్నారు. నిర్మాతల్లో ఒకరైన పల్లి కేశవరావు మాట్లాడుతూ కొంత విరామం తరువాత నిర్మాతగా ఈ సినిమా చేస్తున్నాను. మంచి టీమ్‌తో సినిమా చేస్తున్నాం. చిత్రీకరణ పూర్తయ్యే వరకు కంటిన్యూ షెడ్యూల్ వుంటుంది. అన్నారు. కేథరిన్ థెరిసా, సందీప్ మాధవ్, రాజా చెంబోలు, రవికాలే, దీక్షా పంత్, కీర్తిచావ్లా, నిష్మా, శ్రీనివాస్ రెడ్డి, మధునందన్, ఆనంద్ చక్రపాణి, సాయిరేవతి, భానుశ్రీ, దొరబాబు, బేబీ కృతి నందన తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ: సతీష్ ముత్యాల, సంగీతం: అనూప్ రూబెన్స్, ఎడిటర్: జునైద్ సిద్దిక్, ఆర్ట్ డైరెక్టర్: రాజీవ్ నాయర్, కోడైరెక్టర్: బాలాజి శాస్త్రి, ప్రొడక్షన్ కంట్రోలర్: బి.ముత్యాల రాము, సహ నిర్మాతలు: రొంగల శివశంకర్, గౌటి హరినాథ్



## కథ వినగానే కొత్త కాన్సెప్ట్ అనిపించింది

సంజయ్ రావు, ప్రణవి మానుకొండ జంటగా నటిస్తోన్న చిత్రం 'స్లమ్ డాగ్ హజ్బెండ్'. చిన్న సినిమాగా మొదలైన ఈ చిత్రాన్ని రిలయన్స్ ఎంటర్‌టైన్మెంట్ లాంటి పెద్ద సంస్థ రిలీజ్ చేయబోతోంది. మైక్ మూవీస్ బ్యానర్ నిర్మిస్తోన్న ఈ చిత్రానికి డాషింగ్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ శిష్యుడు డాక్టర్ ఏఆర్ శ్రీధర్ దర్శకత్వం వహించాడు. అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి నిర్మించిన ఈ చిత్రాన్ని జూలై 29న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ సందర్భంగా బ్రహ్మాజి మీడియాతో ముచ్చటించారు. ఆయన చెప్పిన విశేషాలివే.. మామూలుగా నేను కొత్తగా చేసే పాత్రలు రావు. ఎందుకంటే రకరకాల పాత్రలు చేసి ఉన్నాను. కానీ ఇందులో మాత్రం నిజంగానే ఓ కొత్త కారెక్టర్ దొరికింది. ఓల్డ్ సిటీలో ఉండే లాయర్. ఉర్దూ, తెలుగు మిక్స్ చేసి మాట్లాడే ఓ కారెక్టర్. విడాకుల స్పెషలిస్ట్ లాయర్‌గా ఇందులో కనిపిస్తాను. ఓ కొత్త దర్శకుడు కథ చెప్పాడు విని, సలహా చెప్పండి అని అన్నారు. మరి హీరో ఎవరు అని అడిగితే.. ఇంకా డిసైడ్ కాలేదని అన్నారు. ఆ తరువాత ఓ నెలకు మా అబ్బాయిని అడగమని అన్నారు. సంజయ్‌కి స్టోరీ చెబితే నచ్చింది. అలా సినిమా స్టార్ట్ చేశాం. సంజయ్ డాగ్ లవర్ అవ్వడంతో కాన్సెప్ట్‌కు ఈజీగా కనెక్ట్ అయ్యాడు. బన్నీ ఆ ట్రైలర్‌ను చూసి నా దగ్గరకు వచ్చి ప్రశంసించాడు. అదే బెటర్ ఆప్షన్. సప్తగిరి నాకు మంచి స్నేహితుడు. సినిమాలు ఎక్కువగా రిలీజ్ అవుతున్నాయని జూలై 29న ఫిక్స్ అయ్యాం. నిర్మాతలు మాత్రం స్లమ్ డాగ్ హజ్బెండ్ అని పెడితేనే బాగుంటుందని అన్నారు. అనిల్ రావిపూడి స్టార్ డైరెక్టర్. ఆయన స్క్రిప్ట్ రాసి అలా చేద్దాం, ఇలా చేద్దామని ఇచ్చారు. కుళ్లుతో ఉంటే యంగ్‌గా కనిపించం. ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ ఉంటే యంగ్‌గా కనిపిస్తాం. భీమ్స్ అదిరిపోయే సంగీతాన్ని ఇచ్చారు. మా సినిమాకు మంచి మాస్, మెలోడీ పాటలు ఇచ్చారు. పుష్ప మొదటి పార్ట్ కంటే రెండో పార్ట్ అదిరిపోతుంది. దాని బాబులా ఈ సినిమా ఉంటుంది. ఫాహద్ ఫాజిల్ పక్కనే కనిపిస్తాను. ఆయన కూడా ఈ మూవీ ట్రైలర్ చూశారు. మెచ్చుకున్నారు. వేరే భాషల్లోనూ ఈ కాన్సెప్ట్‌ను చేయొచ్చు అని అన్నారు. మహేష్ బాబు గుంటూరు కారం, ప్రభాస్ సలార్, బాలయ్య గారి భగవంత్ కేసరి, ఊరి పేరు భైరవకోన, నాగ శౌర్యతో ఓ సినిమా. ఇలా చాలానే ఉన్నాయి. ప్రభాస్ సలార్ సినిమాలో కొత్త కారెక్టర్ వేస్తున్నాను. రెండో పార్ట్‌లోనే ఎక్కువగా కనిపిస్తాను.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Publishedat # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com